

నౌకపై నారసింహుడు

వైభవంగా సింహాచలేశుడి తెప్పోత్సవం

- పుష్కరిణిలో విహరించిన స్వామి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సింహాచలేశుడు వరాహ పుష్కరిణిలో నౌకలో విహరించాడు. ఏటా పుష్య బహుళ అమావాస్య రోజున జరిగే తెప్పోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి, ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచి మెట్లమార్గంలో కొండ దిగువకు తీసుకువచ్చారు. హంసాకృతిలోని నౌకపై అధిష్ఠింపజేసి, ముమ్మారు ప్రదక్షిణలు చేసి, పుష్కరిణి మధ్యన ఉన్న మండపంలోకి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం సింహాచలం మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహించారు. - 8లో



శ్రీకృష్ణుడిగా అప్పన్న



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా



షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్
- పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో సుమారు 23 వేల మంది ఓటర్లు
- అమలులోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ కానున్నది. పదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ మరుసటి రోజున నామినేషన్లు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ తుదిగడువు. వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో స్కూలు అసిస్టెంట్లు, అంతకంటే హైకేడర్ అంటే హెచ్‌ఎంలు, జూనియర్, సీనియర్ లెక్చరర్లు, వర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో సెకండరీ విద్య బోధన చేసే టీచర్లు ఓటర్లుగా ఉంటారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు గత ఏడాది సెప్టెంబరు 30 నుంచి అవకాశం ఇచ్చారు. నవంబరు 23న ముసాయిదా, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. తుది జాబితాలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళలు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం జిల్లాలో 4,937, పార్వతీపురం మన్యంలో 2,262, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448, విశాఖపట్నం జిల్లాలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత కూడా ఓటు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 1,000 మంది వరకు ... మిగతా 6వ పేజీలో

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

మరోసారి పోటీ చేయనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ

- ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు
- పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ మద్దతుతో శ్రీనివాసులు నాయుడు పోటీ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుపై అధికారికంగా తేల్చని కూటమి

- 6లో



రఘువర్మ



శ్రీనివాసులు నాయుడు

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

- జిల్లాలో 42,700 మంది విద్యార్థులు
- 167 కేంద్రాలు ఏర్పాటు
- 5 నుంచి ఒకేషనల్, 10 నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు నిర్వహణ



మద్దిలపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి నిర్వహించే ఈ పరీక్షలకు 42,700 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ విద్యార్థులు 34,645 మంది, బైపీసీ 4,884, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 3,171 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందుకోసం 167 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తారు.

జనరల్ కోర్సులు బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ఉదయం 10-12, మధ్యాహ్నం 2-5 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఫిబ్రవరి ఒకటో తేదీన నైతిక, మానవీయ విలువలు, 3వ తేదీన పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆయా పరీక్షలకు కచ్చితంగా హాజరవ్వడమే కాకుండా ఉత్తీర్ణత కూడా సాధించాలి.

పక్కాగా ఏర్పాట్లు..

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. వాటిని బోర్డు కార్యాలయంలో వీక్షించే విధంగా అనుసంధానం చేస్తున్నారు. పరీక్షల మెటీరియల్ ఇంటర్ బోర్డు కార్యాలయానికి చేరుకుంది. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్టు ఆర్ఐవో మురళీధర్ చెప్పారు. స్క్వాడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

పరిష్కారం దిశగా.. పంచ గ్రామాల సమస్య

నిర్మాణాల వరకూ ఉపశమనం

- క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నిర్ణయం
- ప్రత్యామ్నాయంగా దేవస్థానానికి 610 ఎకరాలు కేటాయింపు



విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచ గ్రామాల ప్రజలకు శుభవార్త. దేవస్థానం భూముల్లో ఇళ్లు నిర్మించుకొని దశాబ్దాలుగా నివసిస్తున్న వారికి త్వరలో స్థలాలు క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణీత రుసుము కట్టించుకుని పట్టాలు మంజూరు చేయనున్నది. ఇందుకు సంబంధించిన చర్చలన్నీ ప్రాథమికంగా అమరావతిలో పూర్తయ్యాయి. ఈ నిర్ణయం వల్ల పంచ గ్రామాలలో 12,149 మందికి ఊరట కలుగుతుంది.

పంచ గ్రామాల్లో (అడవివరం, పురుషోత్తపురం, చీమలాపల్లి, వెంకటాపురం, వేపగుంట) దేవస్థానం భూములను రైతుల నుంచి కొనుక్కొని కొందరు, ఆక్రమించుకొని మరికొందరు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం 2008లో నిర్వహించిన సర్వే ప్రకారం 12,149 మంది ఆక్రమించిన భూమి విస్తీర్ణం 420 ఎకరాలు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో వీటిని క్రమబద్ధీకరించడానికి ఉత్తర్వులు ... మిగతా 6వ పేజీలో

ప్రత్యామ్నాయ భూమి ఎక్కడెక్కడంటే...?

- గాజువాకలో సర్వే నంబరు 86లో 91.1 ఎకరాలు. దీని మార్కెట్ విలువ రూ.970 కోట్లు.
- మల్కాపురంలో సర్వే నంబరు 14/2లో 293.54 ఎకరాలు. దీని మార్కెట్ విలువ రూ.2,415.24 కోట్లు.
- పెదగంట్యాడలో సర్వే నంబరు 274లో 166.2 ఎకరాలు. దీని మార్కెట్ విలువ రూ.1,206.61 కోట్లు.
- గుల్లలపాలెం సర్వే నంబరు 35లో 60.05 ఎకరాలు. దీని మార్కెట్ విలువ రూ.639.41 కోట్లు.
- దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూమి 610.89 ఎకరాలు. వాటి విలువ రూ.5,231.01 కోట్లు.

మహా దోబూచులాట

ఆస్తి పన్ను చెల్లించడం లేదని వేమన మందిరానికి తాళం

- రూపాయి కట్టకపోయినా తిరిగి లీజుదారులకు అప్పగింత
- వైసీపీ నేత ఒత్తిడికి తలొగ్గిన అధికారులు



మంగళవారం తాళం వేసి ఉన్న వేమన మందిరం



బుధవారం తాళం తీసి కార్యకలాపాలు నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

ఆస్తి పన్ను చెల్లించడం లేదని వేమన మందిరానికి జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారులు మంగళవారం సీల్ వేశారు. అయితే నిర్వాహకులు ఒక్క రూపాయి చెల్లించకపోయినప్పటికీ వేసిన సీల్‌ను వెంటనే తొలగించేశారు. ఈ వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆశీల్‌మెట్ట కూడలిలోని వేమన మందిరాన్ని జీవీఎంసీ 25 ఏళ్ల కిందట ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చింది. మూడేళ్లకు ఒకసారి లీజును పొడిగించుకుంటూ వస్తోంది. ప్రస్తుతం నిర్వాహకులు నెలకు కేవలం రూ.4,200 చొప్పున అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. లీజును ఇంకా పొడిగించడానికి నిబంధనలు అంగీకరించవని, అద్దె బకాయిలు చెల్లించి మందిరాన్ని తమకు అప్పగించాలని కొద్దికాలం కిందట అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు తమకు లీజు పొడిగించాలని కోరుతూ గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కాగా నోటీసులు జారీచేసినా నిర్వాహకులు స్పందించకపోవడంతో ... మిగతా 6వ పేజీలో

విమానాశ్రయంలో ఆకట్టుకున్న మాక్ డ్రిల్



- 8లో

నేడు ఉక్కు మంత్రులు రాక

- ప్లాంటును సందర్శించనున్న కుమారస్వామి, శ్రీనివాసవర్మ



కుమారస్వామి



శ్రీనివాసవర్మ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 29:

కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు గురువారం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును సందర్శించనున్నారు. కేంద్ర మంత్రులు తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకుంటారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిన తరువాత తొలిసారి ప్లాంటుకు వస్తున్న మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేందుకు కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి కేంద్ర మంత్రులు ర్యాలీగా ప్లాంటుకు వెళతారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అన్ని విభాగాలను పరిశీలించనున్నారు. కేంద్ర మంత్రులతో కార్మిక సంఘాలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు భేటీ అయ్యే అవకాశం ఉంది.

వసంత పంచమికి ఏర్పాట్లు

సాగర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సమీపంలో ఉన్న మొగధారమ్మ సరస్వతీ సమేత శ్రీమహాలక్ష్మి ఆలయంలో వచ్చేనెల 2న వసంత పంచమి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 9 గంటలకు చండీ హోమం, సాయంత్రం 6.30 పుష్పాభిషేకం జరగనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

విశాఖ డెయిరీ అక్రమాలపై విచారణ జరపాలి : సీపీఐ

పద్మనాభం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో డెయిరీ నిర్వహిస్తున్న పాల కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల సేకరణ ధర రూ. 4లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు, డెయిరీ చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకుని మాక్స్ చట్టం కిందకు తర్వాత కంపెనీ చట్టం కిందకు యాజమాన్యం మార్చిందన్నారు. దీనివల్ల ప్రభుత్వ పర్యవేక్షణ లేక అక్రమాలకు అవకాశం కలిగిందన్నారు.నియోజకవర్గంలోని పాల సొసైటీల్లో డెయిరీ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు, సూపర్‌వైజర్లు కుమ్మక్కై అవినీతికి పాల్పడుతూ పాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

వెల్లంకిలో పశు వైద్య శిబిరం

ఆనందపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్, చినగదిలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహు వార్షిక పశుగ్రాసం పెంపకం గురించి వివరించారు.అలాగే దూడ పెయ్యిలతో పాటు పశువులకు నట్టల నివారణ మందు వేయాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది 26 పశువులకు చూడు తనిఖీలు, 46 లేగ దూడలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి అనిల్‌కుమార్, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, నాయకులు పిన్నింటి వెంకటరమణ, గొలగాని బాబు పాల్గొన్నారు.

ఎల్‌వీపాలెంలో ఆలయ వార్షికోత్సవం

ఆనందపురం, జనవరి 29 (అంధజ్యోతి) : లోడగలవానిపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయం 18వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అర్చకుడు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఐదు వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం హరేరామ హరేకృష్ణ భజన, బొబ్బిలి కళాకారులతో తప్పెడు గుళ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం జనసేన నాయకుడు పంచకర్ల సందీప్, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బమ్మిడి ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

1 నుంచి వీల్‌చైర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వీల్ చైర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నామని ఆర్థోటిక్స్, ప్రోస్తెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఓపీఏఐ) ప్రతినిధులు తెలిపారు. మెడ్‌టెక్ జోన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ వీల్ చైర్ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) సహకారంతో ఈ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఓపీఏఐ 28వ సమావేశం కూడా నిర్వహించనున్నామని, దీని పురోగతిని చర్చించడానికి ప్రపంచ వ్యాప్తంగా 600 కు పైగా నిపుణులు, పరిశోధకులు విచ్చేస్తున్నారన్నారు.

'రాజ్యాంగం పట్ల అవగాహన ఉండాలి'

భీమునిపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గాడువీధిలో ఉన్న బీజేపీ కార్యాలయంలో బుధవారం సమ్మిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వి.కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనరు కె. రామానాయుడు, మత్స్యకార సెల్ కన్వీనరు శ్రీహరి ముఖ్యఅతిథులుగా హాజరై రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు.కార్యక్రమంలో సునీత, విజయ, రాము, పాల్గొన్నారు.

ఎన్నికల హామీకి కట్టుబడి ఉన్నాం

- త్వరలోనే పంచ గ్రామాల భూ సమస్యకు పరిష్కారం
- కూటమి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశం
- తొలిదశలో నిర్మాణాలు క్రమబద్ధీకరణ
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


స్వామివారి తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ఐదు నియోజకవర్గాల ప్రజలకు ఇబ్బందికరంగా మారిన పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తొలి అడుగు వేసిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. ఇప్పటికే పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలపై నగరానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలతో చర్చించారని, బుధవారం మరోసారిఆయన అమరావతిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనంరామ్ నారాయణరెడ్డి, నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సమస్య పరిష్కారానికి త్వరలోనే కోర్టుకు అటు ప్రభుత్వం, ఇటు పిటిషనర్లు అఫిడవిట్స్ సమర్పించనున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి భూమిని బదలాయించేందుకు అంగీకారం కుదిరిందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో భూ సమస్య కదలిక లేకుండా నిలిచిపోయిందని, ఎన్నికల హామీ మేరకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్టు గంటా పేర్కొన్నారు. సీఎం ఆదేశాల ప్రకారం..దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజుతో కూడా చర్చించి, ఆయన అనుమతి కూడా తీసుకోనున్నట్టు తెలిపారు. తొలిదశలో 12142 నిర్మాణలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కోర్టు అనుమతితో త్వరలోనే వారికి సింహాచలంలో ప్రత్యేక బహిరంగ సభ ఏర్పాటు చేసి, పట్టాలు అందజేస్తామని తెలిపారు. మలిదశలో ఖాళీస్థలాలు, రైతుల హక్కులు తదితర అంశాలను పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి అభివృద్ధి, విజినిగిరిపాలెం గ్రామసమస్యల పరిష్కారికి కూడా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సమావేశం ఉంటుందని ఆయన వెల్లడించారు.


ఎంపీడీఓకు వెంకన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

ఉత్తమ అధికారులకు సన్మానం

ఆనందపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన అధికారులను బీజేపీ మండల నాయకులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీఓ జానకి, వైద్యాధికారి గంగునాయుడును శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, మండల అధ్యక్షురాలు పిల్లా విజయ, మాజీ అధ్యక్షుడు మీసాల రాము నాయుడు, నాయకులు కృష్ణారావు, పోతిన జీవన్ సంతోష్, మాదాబత్తుల బుజ్జి, పిల్లా సూర్యనారాయణ, సీతంనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఆనందపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు ఎంపీడీఓ జానకికు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని చెప్పారు. గత ప్రభుత్వంలో చేపట్టిన వాటర్ ట్యాంక్ పనులు మధ్యలో నిలిచిపోయాయని, పంచాయతీ పరిధిలోని నేలతేరులో 20 ఏళ్లుగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని తెలిపారు. అలాగే ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు ఇంటింటికి కుళాయిలు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొయ్య నాని, లోడగల సురేశ్, ఆల్లి రాజు, గొలగాని సాయి, వెంకటేష్, తోట రాజు, బాల పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


రాజీవ్‌నగర్‌లో మాట్లాడుతున్న వైద్యుడు కాశీవిశ్వనాథ్

ఎండాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూపీహెచ్‌సీ వైద్యుడు కాశీ విశ్వనాథ్ సూచించారు.8వ వార్డు రాజీవ్‌నగర్, శాంతినగర్, ఎండాడ గ్రామాల్లో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

విలాస్‌ఖాన్‌పాలెంలో 'పొలం పిలుస్తోంది'



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ చలం

పద్మనాభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేసే ప్రతి రైతు తమ పేరును రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం చెప్పారు. బుధవారం ఆయన మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి రైతుకు ఆధార్ వలే ఒక ఐడీని వ్యవసాయ శాఖ ఇస్తోందన్నారు. దీని ద్వారా పంట రుణాలు, ఎరువుల రాయితీ పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలోని వరి, మొక్కజొన్న, రాగి పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశిస్తోందని, దాని నివారణకు ఇమ్మామెక్టిన్ బెంజోయేట్ మందును ఎకరాకు 80 గ్రాముల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను శాలువతో సత్కరించిన కూటమి నాయకులు

పద్మనాభం తహసీల్దార్‌కు సత్కారం

పద్మనాభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న తహసీల్దార్ ఆనందరావును కూటమి నాయకులు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనందరావు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే భూ సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారని, అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కె. రామస్వామి నాయుడు, జనసేన జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు వీబీ నాయుడు, మండల బూత్ కమిటీ కన్వీనర్ సోమేశ్, కల్యాణ్, పాండ్రంగి మాజీ సర్పంచ్ పల్లి మహేశ్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూడికలతో సుద్దగెడ్డ


తుప్పలతో నిండిపోయిన సుద్దగెడ్డ

మధురవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్దగెడ్డ పూడికలతో నిండిపోయింది. గెడ్డ పరిధిలో మిథిలాపురి వుడాకాలనీ, ఎన్‌జీఓ కాలనీ, పాత మధురవాడ మెట్ట తదితర ప్రాంతాలు ఉన్నాయి. వీటికి భూగర్భ జలాలు సుద్ద గెడ్డ నుంచే లభిస్తాయి. గెడ్డ మొత్తం పూడికలతో నిండిపోయి, కుచించుకుపోవడంతో భూగర్భ జలాలు నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోయింది. అలాగే దోమల వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి.అధికారులు తక్షణమే స్పందించి గెడ్డలోని పూడికలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వప్రయోజనాల కంటే సమాజ శ్రేయస్సు గొప్ప


శివపార్వతులు, గంగా జలానికి నమస్కరిస్తున్న చాగంటి

కొమ్మాది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పాలకులు స్వప్రయోజనాల కంటే సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించినప్పుడే చరిత్రలో గొప్పవారుగా నిలుస్తారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా ఆయన బాలకాండలోని విశ్వామిత్ర మహర్షి శ్రీరాముడికి చెప్పిన గంగావతరణ ఘట్టం గురించి బుధవారం వివరించారు. తప్పు చేసినవాడు సొంత కుమారుడే అయినా అది ఉపేక్షింపక సమాజ హితం కోసం సగర చక్రవర్తి ప్రవర్తించారని తెలిపారు. కాగా గంగావతరణ ఘట్టం సందర్భంగా గంగా జలాలను తెప్పించి, వాటిని ప్రత్యేక కలశాల్లో ఉంచి శివపార్వతులతో పాటు పూజలు చేశారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ ఆలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

పద్మనాభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. గంజాయిని దేవరాపల్లి మండలం వంటవానిపాలెం నుంచి తీసుకువచ్చి కుర్రపల్లిలోని మామిడితోటలో ప్యాకెట్లు తయారు చేసి, విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వెళ్లగా ముగ్గురు వ్యక్తులు 1.50 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కుర్రపల్లికి చెందిన నిమ్మకాయల సాయిప్రసాద్, ఆనందపురం మండలం పందలపాకకు చెందిన తమట ప్రేమ్‌గోపాల్, దేవరాపల్లి మండలం వంటవానిపాలెంకు చెందిన పాలాకి బొర్సులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శంకరరావు

సాగర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత ఎలాంటి నైపుణ్యాలు పెంచుకోవాలో తెలియజేస్తూ ప్రముఖ కార్పొరేట్ సంస్థల్లో మానవ వనరుల విభాగాల అధిపతులతో గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించింది. సదస్సును జీఎంఆర్ ఇన్‌ఫ్రాలిమిటెడ్, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ డాక్టర్ ఈ. శంకరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ అక్షరాస్యత, నిరంతర విజ్ఞాన సముపార్జన, లోతైన విషయ పరిజ్ఞానంపై దృష్టిసారించాలని చెప్పారు. గీతం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా గీతంలో మానవ వనరులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో గీతం చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎన్. కృష్ణ, ఎడూన్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు, జెమ్ కన్వీనర్ డాక్టర్ కృష్ణకుమారి, జెమ్-25 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్ మిత్ర, జెమ్‌కో సీఈఓ కె. చెర్రి హేడ్స్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కె. లుబ్జనిహార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ టీ. సౌదామిని పాల్గొన్నారు.


స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు (ఇన్‌సెట్లో) అభిషేకం చేస్తున్న పూజారి

భైరవస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఉపాలయం భైరవ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం పుష్యమాస బహుళ అమావాస్య పురస్కరించుకుని వేకువజామునే ఒడిశా సరిహద్దు జిల్లాలు గంజామ్, బరంపురంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంట వరకు రద్దీ ఒకేవిధంగా కొనసాగింది. భక్తులు భైరవ స్వామికి పంచామృతాభిషేకాలు, వడమాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు నువ్వుల నూనె దీపాలు వెలిగించి సకల గ్రహదోషాలు తొలగిపోవాలని పూజలు చేశారు. భక్తుల రద్దీని ముందుగా ఊహించిన సింహాచలం దేవస్థానం అధికారులు తాత్కాలిక క్యూలు ఏర్పాటు చేసి, వాటి నియంత్రణకు సిబ్బందిని నియోగించారు. అలాగే గోపాలపట్నం పోలీసులు శాంతిభద్రలకు విఘాతం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని సింహగిరిపై అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన మాడవీధుల్లోని అష్టదిక్పాలకులకు పూజలు చేసి, గ్రామ బలిహరణ జరిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా 'శతాబ్ది ఉత్సవాలు'


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

భీమునిపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్ల ఉత్సవం (వచ్చే నెల 12 తేదీల్లో) అందరి సహకారంతో చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ఉత్సవ్ పనులను పరిశీలించారు.అనంతరం ఆయన ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఉత్సవ్ కమిటీ నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్సవాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. ఉత్సవ్ కమిటీ కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ 1న పైలాన్ ఆవిష్కరణ, విద్యార్థులతో ర్యాలీ, జీసస్ పార్క్ వద్ద సర్ రతన్ టాటా విగ్రహావిష్కరణ ఉంటాయన్నారు.2న సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థులకు సన్మానాలు జరుగుతాయన్నారు. సమావేశంలో ఉత్సవ్ కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాసరావు, ప్రతినిధులు కె. ముత్యాలరావు, కాళ్ల సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, హెచ్ఎం రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎంఈవో జయప్రద తదితరులు పాల్గొన్నారు.

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేయనున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయల సంఘం ఇప్పటికే మద్దతు పలికాయి. పీడీఎఫ్ తరపున కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ నుంచి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్లను ఆయా సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. శ్రీనివాసులునాయుడుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ (అపస్) మద్దతు ప్రకటించింది. కాగా 2019 ఎన్నికల్లో ఫ్యాప్టో తరపున రఘువర్మ పోటీ చేసి విజయం సాధించారు. ఫ్యాప్టోలో ఉన్న సంఘాలు ఇప్పుడు కలిసి ఒకే అభ్యర్థికి మద్దతు ఇవ్వడం లేదు. రఘువర్మకు ఏపీటీఎఫ్-257, హెచ్ఎం అసోసియేషన్ మాత్రమే ప్రస్తుతానికి మద్దతు ప్రకటించగా, యూటీఎఫ్ ఈ పర్యాయం సీపీఎం అనుబంధంగా ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతు తెలిపింది. మరో సంఘం ఎస్టీయూ ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇదిలావుండగా నగరంలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్న వ్యక్తి ఒకరు ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే విశాఖ జిల్లా ఇంటర్ బోర్డు మాజీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ, ఆనందపురం మాజీ ఎంఈవో పద్మావతిలు నెల రోజుల నుంచి ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నారు. కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు ఎవరికి మద్దతు పలుతాయనేది ఇంకా ప్రకటించలేదు. కూటమికి చెందిన ఒక ఎమ్మెల్సీ, మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు మాత్రం రఘువర్మకు అనుకూలంగా ఉన్నారు. అయితే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని ఉత్తరాంధ్రకు చెందిన కూటమి నేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మద్దతుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. విపక్ష పార్టీ వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘం ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.

పరిష్కారం దిశగా పంచ గ్రామాల భూ సమస్య

... 5వ పేజీ తరువాయి

జారీచేసింది. ఏ ప్రాంతం వారు ఎంత కట్టాలో ప్రకటించింది. జీవో నంబరు 578 ప్రకారం ఆక్రమిత భూమిని క్రమబద్ధీకరించుకోవడానికి 6,110 మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిలో 2,485 దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. ఇంకా 3,625 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమబద్ధీకరణ అంశంపై 2005లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కోర్టులో దాఖలైంది.

ఈ భూ సమస్య పరిష్కారానికి దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూమి ఇవ్వడానికి 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు వచ్చింది. మొత్తం 547 ఎకరాలు ఇస్తామని ప్రతిపాదించింది. అయితే అప్పట్లో దేవస్థానం ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు అంత సుముఖత వ్యక్తం చేయలేదు. విశాఖపట్నంలో విలువైన భూమి తీసుకొని ప్రత్యామ్నాయంగా నగరానికి దూరంగా భూములు ఇస్తే తీసుకోలేమని స్పష్టంచేశారు. నగరంలోనే భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు పార్లమెంటు నియోజకవర్గాలు (విశాఖపట్నం, అనకాపల్లి), ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, పెందుర్తి)కు సంబంధించిన ఈ సమస్యపై తాజాగా ప్రభుత్వం మరోమారు కసరత్తు చేసింది. నగరంలోనే భూములు ఇచ్చేందుకు సిద్ధమైంది.

న్యాయస్థానం అంగీకరిస్తేనే..

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో బుధవారం చర్చలు జరిగాయి. ప్రత్యామ్నాయ భూములు తీసుకోవడానికి, కేసులు ఉపసంహరించుకోవడానికి దేవదాయ శాఖ అధికారులు అంగీకరించారు. న్యాయస్థానంలో వచ్చే తదుపరి వాయిదాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వివరిస్తారు. దానికి న్యాయస్థానం అంగకరిస్తే ఇది ముందుకు వెళుతుంది. ఈ విషయాన్ని సవివరంగా కోర్టుకు తెలియజేయాలని అడ్వకేట్ జనరల్‌కు సీఎం సూచించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా

... 5వ పేజీ తరువాయి

పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ఈ ప్రభావం గురువారం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఉంటుంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,444 కోట్ల ప్యాకేజీపై కర్మాగారం అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఉక్కు మంత్రి అధికారికంగా ప్రకటన చేయాలనుకున్నట్టు సమాచారం. అయితే ఎన్ని కల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఉక్కు కర్మాగారంలో పర్యటించవచ్చునని, కానీ...హామీలు, అభివృద్ధి పథకాలపై ప్రకటన చేయరాదని అంటున్నారు. అదే విధంగా అంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఆ కార్యక్రమం వాయిదా పడింది. సుమారు ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికార పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

మహా దోబూచులాట

... 5వ పేజీ తరువాయి

వేమన మందిరానికి జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారులు మంగళవారం సీల్ వేశారు. అయితే ఎలాంటి బకాయి చెల్లించకపోయినప్పటికీ సీల్‌ను తొలగించి మళ్లీ ప్రైవేటు వ్యక్తులకే అప్పగించేశారు. జీవీఎంసీ పాలక వర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేత ఒకరు ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతోనే అధికారులు తలొగ్గి బకాయిలు చెల్లించకపోయినా సీల్‌ను తొలగించారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

దుర్గానగర్‌లో దుర్గంధం



పూడికలతో నిండిన ప్రధాన కాలువ

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దుర్గానగర్ ప్రధాన కాలువ పూర్తిగా పూడికలతో నిండిపోయిం ది. దీని నుంచి దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, ఏ వ్యాధులు ప్రబలుతాయోనని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కాలువల్లో పూడికలు తీయకపోవడంతో తరచూ ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడికల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ తొమ్మిదో సెక్టరు అప్పుఘర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మీసాల విజయలక్ష్మి తన సోదరి జమ్ములక్ష్మి బుధవారం తెల్లవారు జాము నుంచి కనిపించడం లేదంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ కారణాలతో ఆమెను ఈ నెల 24న గుంటూరు నుంచి తన ఇంటికి తీసుకువచ్చామని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ కామత్ హోటల్ ఎదురుగా ఓ ద్విచక్ర వాహనదారుడు అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఓ వృద్ధుడిడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం వి.నటరాజ్ (77) నడకకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కామత్ హోటల్ సమీపంలో టి.శివరామచంద్రా రెడ్డి ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొన్నాడు. దీంతో నటరాజ్‌కు గాయాలయ్యాయి. ఎస్ ఐ జీ ధనుంజయ్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీ నరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం

- వ్యాపారాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అడుగులు
- ఎంఎస్ఎంఈ సర్వేతో వివరాలు సేకరణ
- తూర్పులో 98 శాతం పూర్తి



ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు

మద్దిలపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. కింది స్థాయి నుంచి వ్యాపారాభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఔత్సాహిక యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ర్యాంపు సర్వే చేపట్టింది. ఎంఎస్ఎంఈ సర్వేతో రాష్ట్ర ప్రభుత్వంనూతన పారిశ్రామిక విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను సేకరించడానికి సచివాలయ కార్యదర్శులు ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహిస్తున్నారు.

తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే 98 శాతం సర్వే పూర్తి చేశారు. సచివాలయ అడ్మిన్, శానిటేషన్ కార్యదర్శులు సర్వేలో పాల్గొని తమ పరిధిలోని అన్నీ రకాల వ్యాపారస్తుల వివరాలు సేకరిస్తున్నారు. తూర్పులో విద్యుత్ కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్సులు ఆధారంగా సుమారు 9 వేల చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ఉన్నాయి. వీటితో పాటు తోపుడు బండ్ల వ్యాపారస్తుల వివరాలు సైతం సర్వే చేస్తున్నారు.

సర్వే ఇలా...

సచివాలయాల పరిధిలోని దాదాపుగా అన్ని రకాల వ్యాపారస్తులకు సర్వే చేస్తున్నారు. దుకాణాలకు వెళ్లి ఎంఎస్ఎంఈ యాప్‌లో వ్యాపారస్తుల వివరాలు నమోదు చేస్తున్నారు.

వ్యాపారస్తుల ఆధార్, పాన్, రేషన్ కార్డుల వివరాలతో పాటు ఎప్పటి నుంచి వ్యాపారం నిర్వహిస్తున్నారు?ఎంత మంది పని చేస్తున్నారు? రుణాలు ఏమైనా తీసుకున్నారా? సంవత్సరాదాయం ఎంత? విద్యుత్ బిల్లు ఎంత వస్తోంది వ్యాపారం లాభాల్లో ఉందా, నష్టాల్లో ఉందా? ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలని కోరుకుంటున్నారు వంటి వివరాలను నమోదు చేస్తున్నారు. చిన్న వ్యాపారి నుంచి పెద్ద వ్యాపారస్తుల వరకు వారి వ్యాపార పరిస్థితులు తెలుసుకుని, తద్వారా వారికి అవసరమైన ప్రయోజనాలు కల్పించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

సిరిపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్పీల ఉద్యోగ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు.

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలను డ్వాక్రా గ్రూపుల్లోకి తీసుకొచ్చి అనేక సేవలందించిన ఆర్పీలకు ప్రభుత్వాలు ఇస్తున్న వేతనాలు చాలా తక్కువ అన్నారు. ఆ వేతనం కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలు ముగిసిన ప్రతీసారి ఆర్పీల మీద రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, ఆర్పీలు పార్టీ మనుషులు కాదని, ప్రభుత్వ ఉద్యోగులన్న విషయం గుర్తించాలన్నారు. ఆర్పీల పని విధానం బాగుందని అధికారులు పలు సందర్భాల్లో గుర్తించారన్నారు. అనుభవం గల ఆర్పీలను మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ ద్వారా తొలగించాలని ప్రయత్నం ఆలోచించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం జీవీఎంసీ ఏడీసీ, యూసీడీ పీడీలకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ నాయకులు పి.మణి, మల్లీశ్వరి, లత, ఝాన్సీ, సత్య, వరలక్ష్మీ, దేవి, లక్ష్మి, రత్నాలు, సన్యాసమ్మ, విశాలాక్షి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపు



బడ్డీలను తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్లను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేయడమే కాకుండా... అద్దెకు ఇచ్చి సొమ్ములు చేసుకుంటున్న వైనంపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మొద్దు నిద్ర వదలడం లేదు. కానీ పారిశుధ్య విభాగం అధికారులు మాత్రం తమ విధులకు ఇబ్బందిగా ఉన్న బడ్డీలను తొలగించారు. అయితే ఏ విభాగం వారు చేయాల్సిన పనిని ఆ విభాగం వారు చేయకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోని ఆక్రమణ బడ్డీల దుస్థితి. బుధవారం ఉదయం జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఈ ప్రాంతంలో పర్యటించి, ఇక్కడి సులభ్ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న ఆటోస్టాండ్ పక్కనున్న చెత్తకుండీని ఆనుకుని అక్రమంగా, నిరుపయోగంగా ఏర్పాటు చేసిన బడ్డీలను వెంటనే తొలగించలని ఆదేశించారు.

ఈ బడ్డీలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించినా.. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయం సిబ్బంది మాత్రం వెంటనే స్పందించి చెత్తకుండీకి ఆనుకుని ఆక్రమించి నిరుపయోగంగా ఉన్న బడ్డీలను తొలగించారు. తమ విధులకు ఇబ్బందిగా ఉండడంతో ఆ మేరకు పారిశుధ్య సిబ్బంది తరలించారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో బడ్డీలను తొలగించాల్సిన ఉంది. కనీసం ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు దీనిపై తగిన శ్రద్ధ వహించాలని, వెంటనే ఆక్రమణ బడ్డీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరవాడ ఎంపీడీవో తీరుపై అనకాపల్లి కలెక్టర్ అసహనం

- విచారణకు ఆదేశం
- రక్త నమూనాలు సేకరించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది
- మరోవైపు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించిన సీఐ
- కార్యాలయ సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్న జడ్పీ డిప్యూటీ సీఈవో



ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్

పరవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఒక ఎంపీడీవో తీరుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు అనుమానం వచ్చింది. తాను అడుగుతున్న ప్రశ్నలకు ఎంపీడీవో పొంతనలేని సమాధానాలు చెబుతుండడం, వారిస్తున్నా వినకపోవడంతో తక్షణం విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తెలుగులో సమాధానం చెప్పాలని కలెక్టర్ చెబుతున్నప్పటికీ ఎంపీడీవో తన పంథాను మార్చుకోకుండా ఇంగ్లీషులో మాట్లాడుతుండడంతో అనుమానం వచ్చి విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయంత్రం ఆరు గంటలకు పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో ప్రవర్తన గురించి అక్కడ అధికారులతో పాటు సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్నారు. ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు కావస్తుంది. ఈ నాలుగు నెలల్లో ఎలా వ్యవహరించారన్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మద్యం మత్తులో విధులకు హాజరై, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారని విచారణలో బయటపడినట్టు తెలిసింది.

రక్త నమూనాలను సేకరించిన డీఎం అండ్ హెచ్‌వో

కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎం అండ్ హెచ్‌వో) రవికుమార్ సాయంత్రం ఐదు గంటలకు పరవాడ ఒకటి, రెండు సచివాలయాలకు చెందిన ఏఎన్ఎంలతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. అప్పటికే సీఐ తన సిబ్బందితో ఎంపీడీవోకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసినట్టు తెలిసింది.

బాలుర పరిశీలన గృహం సందర్శన

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి దీనదయాళ్‌పురంలో నిర్వహిస్తున్న బాలుర పరిశీలన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బుధవారం సందర్శించారు.బాలలకు కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వంటకాలనురుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అంకితభావం, సేవా దృక్పథంలో పని చేయాలని కోరారు. నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని తొందరలో వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. చాలాకాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు చెప్పారు.

ఎర్రమట్టి దిబ్బలను సందర్శించిన విశాఖ వ్యాలీ స్కూలు విద్యార్థులు



ఎర్రమట్టి దిబ్బల సందర్శనలో విశాఖ వ్యాలీ స్కూలు విద్యార్థులు

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర పర్యటనలో భాగంగా విశాఖ వ్యాలీ విద్యార్థులు బుధవారం భీమిలి సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలను సందర్శించారు. విశాఖ జిల్లా ఇంటెక్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యురాలు రేణుకరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎర్రమట్టి దిబ్బలను పరిశీలించి అక్కడి భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రమట్టి దిబ్బల ప్రత్యేకతను రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.

గతంలో సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు వివిధ కారణాల వల్ల క్రమేపీ 450 ఎకరాలకు పరిమితం అయ్యాయన్నారు. ఇలాంటివి సౌదీ అరేబియా, నమీబియాలో ఉంటాయన్నారు. అలాంటి ప్రత్యేకత కొండలు విశాఖ సమీపంలో ఉండడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాం గ్రామంలో నివాసముంటున్న కింతాడ దేవి (35) భవన నిర్మాణ కార్మికురాలిగా పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంది. బుధవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని బయ్యవరం సమీపం జమ్మాదులపాలేనికి చెందిన దేవి 15 ఏళ్ల క్రితం తుంగ్లాం గ్రామానికి చెందిన ఆనందరావును ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా రెండేళ్ల కిందట ఆనందరావు భార్య, పిల్లలను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటినుంచి దేవి కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఇప్పుడు ఆమె మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం రేపు

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పైపులైన్లకు మరమ్మతులు కారణంగా శుక్రవారం జోన్-3 పరిధిలోని 17వ వార్డు ఎంవీపీ కాలనీ 1, 4, 5 సెక్టర్లు, 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టర్ 2, 3, 6, 7, 9, 10.., అలాగే 19వ వార్డు పరిధిలోని సెక్టర్ 11, వాసవానిపాలెం తదితర ప్రాంతాల్లో పైపు లైన్ల ద్వారా మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ టౌన్ సర్వీస్ రిజర్వాయరు నుంచి ఎండాడ రిజర్వాయరుకు వచ్చే ప్రధాన పంపింగ్ మెయిన్ లైను 900ఎంఎం డయా ఇసుకతోట నుంచి శివాజీపాలేనికి వెళ్లే మార్గంలో శ్మశాన వాటిక వద్ద మరమ్మతులకు గురైందని తెలిపారు.

ఉక్కు ఉద్యోగులు వాస్తవాలు గ్రహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు రక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రూ.11440 కోట్లు కేటాయించడం ద్వారా ప్లాంటు రక్షణకు కట్టు ఉన్నామన్న నమ్మకం కలిగించారని, అయితే కొందరు ఉక్కు ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించకుండా నిరసనలతో కాలం గడుపుతూ పరిస్థితిని సంక్లిష్టం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు ఆరోపించారు.బుధవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్డీఏ ప్రభుత్వం వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు రూ.2500 కోట్లు కేటాయించి స్టీల్‌ప్లాంట్‌కు అండగా నిలిచిందన్నారు. ఒకప్పుడు లాభాల బాటలో నడిచిన విశాఖ ఉక్కు పరిశ్రమ రాజకీయాల జోక్యం, అసమర్థ అధికారుల పాలనా వ్యవహారాల కారణంగా నష్టాలకు వెళ్లిందన్నారు. ఉద్యోగుల అస్తవ్యస్త పనితీరు కారణంగా ఉత్పత్తి గణనీయంగా తగ్గిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీఏ ప్రభుత్వం ప్లాంటుకు అండగా నిలిచిందని, పని తీరు మెరుగు పరచడంపై ఉద్యోగులు దృష్టి సారిస్తే మంచిదని పరశురామ్‌రాజు హితవు పలికారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) ఫిబ్రవరి 1నుంచి మార్చి 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22879/22880) ఫిబ్రవరి 1 నుంచి 23 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ కోచ్; సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20809/20810) ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (08311/08312) ఫిబ్రవరి 5 నుంచి 28 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; భువనేశ్వర్-జునాగఢ్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20837/20838) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు స్లీపర్ క్లాసు కోచ్; పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) ఫిబ్రవరి 7 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; భువనేశ్వర్-జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18447/18448) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటాయన్నారు.

మళ్లింపు మార్గంలో అమృతసర్ ఎక్స్‌ప్రెస్ రైలు

సంబల్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రతి బుధ, శని, ఆదివారాల్లో అమృతసర్‌లో బయలుదేరే అమృతసర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు (20808) ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 30 వరకు....అలాగే ప్రతి మంగళ, శుక్ర, శనివారాల్లో విశాఖలో బయలుదేరే విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్ (20807) రైలు ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 29 వరకు ఇరువైపుల సంబల్‌పూర్ స్టేషన్‌కు చేరకుండా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ పేర్కొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌లు కొనసాగింపు

విశాఖ మీదుగా భువనేశ్వర్-ముంబయి మధ్య రాకపోకలు సాగిస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (11019/11020) ఖర్డత్, షెహబాద్ స్టేషన్లలో తాత్కాలికంగా కల్పించిన అదనపు హాల్ట్‌లు కొనసాగుతాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఖర్డత్ స్టేషన్ హాల్ట్ ఫిబ్రవరి 7 నుంచి, షెహబాద్ స్టేషన్ హాల్ట్ మార్చి 3 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

పరస్పర సహకారంతో యువతకు ఉపాధి చూపండి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచన

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్య, నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక సంస్థలు పరస్పర సహకారం, ప్రణాళికతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. 'ఇంటరాక్షన్ ఆన్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ క్రియేషన్ ఇన్ విశాఖ రీజియన్' లక్ష్యంతో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదివిన చదువుకు తగిన ఉద్యోగం నిర్ణీత సమయంలో వచ్చేలా ప్రణాళికలు రచించాలని, ఉద్యోగాలకు తగ్గట్టు కోర్సులు అందించాలని ఆయా సంస్థలను కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సమన్వయంతో పనిచేసి భవిష్యత్‌లో స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. విద్యా సంస్థలు, పరిశ్రమలు నెలకోసారి ప్రత్యేకంగా సమావేశమై, అవసరాలను గుర్తించి తగిన అభ్యర్థులను ఖరారు చేసుకోవాలన్నారు. విద్యా నైపుణ్య శిక్షణ సంస్థలతో ముందుగానే ఒప్పందాలు చేసుకుని తగిన కోర్సులు ప్రవేశపెట్టేలా సంప్రదింపులు జరపాలన్నారు. ఈ సదస్సులో సీఐఐ ప్రతినిధి మురళీకృష్ణ, నీరజ్ సర్దా, గ్రంధి రాజేష్, ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర విభాగాల అధికారులు, ఐటీ, ఫార్మా, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులకు ప్రశంసలు



ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ (ఏఎస్ఆర్‌టీయూ) విశాఖలో నిర్వహించిన అథ్లెటిక్ మీట్ విజయవంతంగా నిర్వహించిన ఆర్టీసీ అధికారులకు డీజీపీ, ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజయనగరం జోనల్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

అక్రమాలకు చెక్ పెట్టి..గ్రీన్‌బెల్ట్‌కు దారిచూపి..!

మురళీనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని వేతనాల రూపంలో తీసుకుంటున్న అధికార యంత్రాంగం ప్రజోపయోగ పనులకన్నా, పలుకుబడి వర్గాలకు వత్తాసు పలకడం, వారి వ్యవహారాలను చూసీచూడనట్లు వదిలేయడం అప్పుడప్పుడు రివాజుగా మారింది. మురళీనగర్ బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఏఎస్ఎన్ మెగామాల్ వద్ద నిర్వాకమే ఇందుకు ప్రబల ఉదాహరణ. ఇదివరకు పచ్చని చెట్లతో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని నామరూపాల్లేకుండా చేసి మాల్‌కు హైవే నుంచి ప్రధాన మార్గం ఉండేలా సహకరించారు. ఇపుడు నగరమంతా ఏకరీతిన ఉండటం కోసం జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం రూ. కోట్లు వెచ్చించి హైవే రోడ్లకు ఇరువైపులా వేస్తున్న ఇనుప రక్షణ గ్రిల్స్‌ను అడ్డుకున్నారు. వారి మాల్ ఉన్నంత మేర గ్రిల్ వేయనీయకుండా జీవీఎంసీ యంత్రాంగాన్ని ప్రభావితం చేసి ప్రధాన ద్వారాన్ని తలపించేలా మార్చుకుని గ్రీన్‌బెల్ట్ మొత్తం మట్టి, కాంక్రీట్ పోసి, ఆపై నిర్మాణ సామగ్రి, క్రేన్లు అక్కడే నిల్వ చేస్తూ వారి సొంత యార్డులా వాడుకున్నారు. ఇపుడు రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం విశాఖ నగరపాలక సంస్థను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో


షాపింగ్ మాల్ ఆక్రమణలను తొలగించి ఏర్పాటు చేసిన కొత్త ఇనుప రక్షణ గ్రిల్స్

ఇటీవల విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఇక్కడి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. ఆక్రమణలపై జీవీఎంసీకి ఫిర్యాదు చేసి దగ్గరుండి తొలగించారు. వారి స్థలం ఉన్నంత వరకే అనుమతుల మేరకు షాపింగ్ మాల్ నిర్మించాలని ఆ భవన యజమానులకు సూచించారు.

వాస్తవానికి వీరిది ఏపీఐఐసీ ప్లాన్

ఈ నిర్మాణం జరుగుతున్న ఏడు ఎకరాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం ఏపీఐఐసీ నుంచి వీరు కొనుగోలు చేసుకున్నారు. ప్లాన్ మంజూరు కూడా విజయవాడ ఏపీఐఐసీ కార్యాలయం నుంచే లభించింది. ఈ మేరకు వీరు 10 అంతస్థుల భవనం కడుతున్నారు. మూడు బేస్‌మెంట్ సెల్లార్లు, ఏడు అంతస్థులుగా ఇక్కడ రూపుదిద్దుకుంటున్న ఈ కట్టడం పనులు 2022 డిసెంబరులో ఆరంభించారు. వీరికి ప్లాన్ ప్రకారం ఏపీఐఐసీ రహదారులే ఉంటాయి. నేరుగా జీవీఎంసీ నాలుగు వరుసల హైవే రోడ్డు ప్లాన్‌లో లేదు. కానీ దారి పొడవునా కొనసాగుతున్న వాణిజ్య సముదాయాల మాదిరే వీరు ఈ దారిని ఎంచుకున్నారు. జీవీఎంసీ నిబంధనలు అతిక్రమించి వీరు చేపడుతున్న కట్టడాలకు ఇపుడు చెక్ పెట్టారు.

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

- మరోసారి పోటీ చేయనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ
- ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు
- పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి
- పీఆర్‌టీయూ మద్దతుతో శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేయనున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయల సంఘం ఇప్పటికే మద్దతు పలికాయి. పీడీఎఫ్ తరపున కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ నుంచి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్లను ఆయా సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. శ్రీనివాసులునాయుడుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ (అపస్) మద్దతు ప్రకటించింది. కాగా 2019 ఎన్నికల్లో ఫ్యాప్టో తరపున రఘువర్మ పోటీ చేసి విజయం సాధించారు. ఫ్యాప్టోలో ఉన్న సంఘాలు ఇప్పుడు కలిసి ఒకే అభ్యర్థికి మద్దతు ఇవ్వడం లేదు. రఘువర్మకు ఏపీటీఎఫ్-257, హెచ్‌ఎం అసోసియేషన్ మాత్రమే ప్రస్తుతానికి మద్దతు ప్రకటించగా, యూటీఎఫ్ ఈ పర్యాయం సీపీఎం అనుబంధంగా ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతు తెలిపింది. మరో సంఘం ఎస్టీయూ ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇదిలావుండగా నగరంలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్న వ్యక్తి ఒకరు ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే విశాఖ జిల్లా ఇంటర్ బోర్డు మాజీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ, ఆనందపురం మాజీ ఎంఈవో పద్మావతిలు నెల రోజుల నుంచి ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నారు.

కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు ఎవరికి మద్దతు పలుతాయనేది ఇంకా ప్రకటించలేదు. కూటమికి చెందిన ఒక ఎమ్మెల్సీ మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు మాత్రం రఘువర్మకు అనుకూలంగా ఉన్నారు. అయితే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని ఉత్తరాంధ్రకు చెందిన కూటమి నేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మద్దతుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. విపక్ష పార్టీ వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘం ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గుజ్జు నారాయణ రెడ్డి


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు నుంచి నియామక పత్రం అందుకుంటున్న నారాయణరెడ్డి

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 53, 54 వార్డుల మండల అధ్యక్షుడిగా గుజ్జు నారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఇతర పెద్దలకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంకు వినతి

డాబాగార్డెన్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును విజయవాడ సమీపంలోని ఉండవల్లిలో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి, ప్రధాన సమస్యలపై విన్నవించారు. దేవదాయశాఖ పరిధిలోని 22/ఏ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. యల్లమ్మతోట, పూతీవారిమాన్యం, అస్సాంగార్డెన్స్, వెంకటేశ్వరమెట్ట, కనకమహాలక్ష్మి ఆలయం ప్రాంతాల్లోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని తెలిపారు.


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

నిజాన్ని నిక్కచ్చిగా చెప్పగలిగే శక్తి రచయితలదే: జయంతి ప్రకాశ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత జె.పి.శర్మ, చిత్రంలో ప్రభాకర్ తదితరులు

సీతంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమ రచనా వ్యాసంగాన్ని చిన్నతనంలోనే ప్రారంభించాలని, నిజం నిక్కచ్చిగా చెప్పగల సత్తా రచయితలకు ఉందని, వారు మార్గనిర్దేశం చేయాలని ప్రముఖ రచయిత జయంతి ప్రకాశ శర్మ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజం కళాశాలలో సహృదయ సాహితీ సమితి ఆధ్వర్యంలో బుధవారం కథాకచేరి కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శర్మ మాట్లాడుతూ సమాజంలో మార్పులను రచయితలు మాత్రమే సరిగా వ్యక్తీకరించగలగాలంటూ పలు సూచనలు చేశారు. ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రాసిన 'నొప్పుల నూకాలతల్లి' కథను డాక్టర్ కె.జి.వేణు పరిచయం చేశారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయకుమార్, రచయితలు సీహెచ్ సూర్యనారాయణ, డాక్టర్ డీవీ సూర్యారావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కేవీఎన్ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, అయ్యల సోమయాజుల ప్రసాద్, డీఎస్ కుమార్, ఉక్కు సాహితి రామారావు, రాంబాబు పాల్గొన్నారు.

పారాలీగల్ వాలంటీర్ కోసం 31లోగా దరఖాస్తు చేయాలి

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు న్యాయ సహాయం చేయాలనే ఔత్సాహికులు పారా వాలంటీర్లుగా పనిచేయడానికి ఈ నెల 31లోగా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, ఫొటోతో సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. కనీసం పదో తరగతి విద్యార్హత ఉండాలని, వివిధ సేవా సంస్థల్లో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైనవారికి జీతం, పారితోషికం ఉండవని స్పష్టంచేశారు. శిక్షణ అనంతరం ఎంపికైన వాలంటీర్లను ఏడాది కాలానికి నియమించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడలు


హైజంప్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడల్లో బుధవారం కూడా వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్, బ్యాడ్మింటన్,టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. గురువారం ఫైనల్ పోటీలు జరుగుతాయి. కళాశాల ప్రిన్సిపాల్,క్రీడల సమన్వయకర్త డా.కె.నారాయణరావు, సహ సమన్వయకర్త డా.బి.జానకీరామ్‌ల ఆధ్వర్యంలో సాంకేతిక శాఖ ఆర్జేడీలు సత్యనారాయణ మూర్తి, నిర్మల కుమార్ ప్రియ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. గురువారం క్రీడల ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

117 జీవో రద్దుకు డిమాండ్

అక్కయ్యపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నష్టం వాటిల్లే 117 జీవో రద్దు చేసి ఎస్‌జీటీ పోస్టులు పెంచి డీఎస్సీలో కలిపి ప్రకటించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. విద్యార్థులకు ప్రతి శనివారం స్కూల్ బ్యాగ్ లేని రోజు (నో బ్యాగ్ డే)గా ప్రకటించడం అభినందనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 117 జీవోను అమలు చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మూడు, నాలుగు, అయిదు తరగతుల విద్యార్థులను 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాలలకు తరలించడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళలేక ప్రైవేటు పాఠశాలల్లో చేరారన్నారు. కొంతమంది విద్యకు కూడా దూరమయ్యారని చెప్పారు. దీనివల్ల ఎస్‌జీటీ పోస్టులు కూడా తగ్గిపోయాయని పేర్కొన్నారు. 117 జీవోను తక్షణమే రద్దు చేసి పాత పద్ధతిలో పాఠశాలను నిర్వహించాలన్నారు.

'చెత్త తరలింపులో నిర్లక్ష్యాన్ని సహించం'


వార్డులో శుభ్రతను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ నాగరాజు

జ్ఞానాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపు, సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను జీవీఎంసీ జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు హెచ్చరించారు. బుధవారం ఉదయం గ్రేటర్ 33వ వార్డులోని ఎస్సీకాలనీ, అల్లిపురం మెయిన్ రోడ్డు, వివేకానంద కాలనీ, సౌత్ జైల్ రోడ్డు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వార్డులో పారిశుధ్యం సరిగా లేదని స్థానికులు జెడ్సీకి ఫిర్యాదు చేయడంతో ఆయన శానిటరీ సిబ్బందిపై మండిపడ్డారు. డబ్బాలు ఇచ్చిన చోట చెత్త తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టమాటాకు భలే డిమాండ్

సీతమ్మధార, జనవరి 29: సీతమ్మధార రైతు బజార్‌లో టమాటా కోసం బుధవారం జనం ఎగబడ్డారు. ధర తగ్గడంతో పాటు పెద్ద రైతుబజార్‌లలో ఒకటైన ఎంవీపీ, నరసింహనగర్ రైతు బజార్‌లకు సెలవులు కావడంతో సీతమ్మధారకు ఎక్కువమంది కొనుగోలుదారులు వచ్చారు. టమాటా ధర కిలో రూ.12 కావడంతో అమ్మకందారులైన రైతులకు గిట్టుబాటు కావటం లేదు. ధర ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి తెచ్చి అమ్మేవారు. ఇప్పుడు ధర తగ్గడం, విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడంతో మిగులు తక్కువగా ఉండడంతో అమ్మకానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడి, ఖర్చులు పెరగడంతో బయట బజార్ నుంచి రైతులు టమాటా కొనుగోలు చేయడం లేదు. దీంతో ఉదయం బజార్ తెరిచిన వెంటనే టమాటా కొనుగోళ్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పది గంటలకు వచ్చిన వారికి నాణ్యమైన టమాటాలు దొరకలేదు. బజార్‌లో ఒకే కౌంటర్‌లో టమాటా బాగుండటంతో కొనుగోలు చేయడానికి ఒకరిపై ఒకరు జనం ఎగబడ్డారు.


సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా కొనుగోలుకు ఎగబడుతున్న జనం

మహా దోబూచులాట

... 5వ పేజీ తరువాయి

వేమనమందిరానికి జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారులు మంగళవారం సీల్ వేశారు. ఎలాంటి బకాయి చెల్లించకపోయినప్పటికీ సీల్‌ను తొలగించి మళ్లీ ప్రైవేటు వ్యక్తులకే అప్పగించేశారు. జీవీఎంసీ పాలక వర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేత ఒకరు ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతోనే అధికారులు తలొగ్గి బకాయిలు చెల్లించకపోయినా సీల్‌ను తొలగించారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పరిష్కారం దిశగా పంచ గ్రామాల భూ సమస్య

... 5వ పేజీ తరువాయి

జారీచేసింది. ఏ ప్రాంతం వారు ఎంత కట్టాలో ప్రకటించింది. జీవో నంబరు 578 ప్రకారం ఆక్రమిత భూమిని క్రమబద్ధీకరించుకోవడానికి 6,110 మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిలో 2,485 దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. ఇంకా 3,625 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమబద్ధీకరణ అంశంపై 2005లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కోర్టులో దాఖలైంది. ఈ భూ సమస్య పరిష్కారానికి దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూమి ఇవ్వడానికి 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు వచ్చింది. మొత్తం 547 ఎకరాలు ఇస్తామని ప్రతిపాదించింది. అయితే అప్పట్లో దేవస్థానం ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు అంత సుముఖత వ్యక్తం చేయలేదు. విశాఖపట్నంలో విలువైన భూమి తీసుకొని ప్రత్యామ్నాయంగా నగరానికి దూరంగా భూములు ఇస్తే తీసుకోలేమని స్పష్టంచేశారు. నగరంలోనే భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు పార్లమెంటు నియోజకవర్గాలు (విశాఖపట్నం, అనకాపల్లి), ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, పెందుర్తి)కు సంబంధించిన ఈ సమస్యపై తాజాగా ప్రభుత్వం మరోమారు కసరత్తు చేసింది. నగరంలోనే భూములు ఇచ్చేందుకు సిద్ధమైంది.

న్యాయస్థానం అంగీకరిస్తేనే..

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో బుధవారం చర్చలు జరిగాయి. ప్రత్యామ్నాయ భూములు తీసుకోవడానికి, కేసులు ఉపసంహరించుకోవడానికి దేవదాయ శాఖ అధికారులు అంగీకరించారు. న్యాయస్థానంలో వచ్చే తదుపరి వాయిదాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వివరిస్తారు. దానికి న్యాయస్థానం అంగకరిస్తే ఇది ముందుకు వెళుతుంది. ఈ విషయాన్ని సవివరంగా కోర్టుకు తెలియజేయాలని అడ్వకేట్ జనరల్‌కు సీఎం సూచించారు.

బ్యాంకు సిబ్బంది వితరణ

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు వద్ద గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాంకు ఆఫ్ బరోడా మర్రిపాలెం శాఖ ఎగ్జామ్ ప్యాడ్, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేసింది. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది బుధవారం పాఠశాలకు వచ్చి వీటిని పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేరీ జసింత, పీఎస్ఎన్ మూర్తి, శ్రీదేవి, నళిని, పార్వతి పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

డాబాగార్డెన్స్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జీవీఎంసీ పరిధిలోని మాంసాహార దుకాణాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ముఖ్య వైద్యాధికారి డా.ఈఎస్‌వీ నరేష్‌కుమార్ తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారాలు వినియోగించరాదని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు విక్రయశాలలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు, అపరాధ రుసుము తప్పదని హెచ్చరించారు.

టెన్నిస్ మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుధవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ కోర్టులు వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫైయింగ్ రౌండ్‌ల నుంచి కొందరు మెయిన్ డ్రాకు అర్హత సాధించగా, సీడింగ్ ఆటగాళ్లు నేరుగా మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 35, 45, 55 ప్లస్ ఏజ్ గ్రూప్‌లకు సంబంధించి ఒక్కొక్క విభాగం నుంచి 32 మంది ఆటగాళ్లు పోటీపడనుండగా, 65 ప్లస్, 75 ప్లస్ రెండు విభాగాల నుంచి 32 మంది పాల్గొంటున్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లలో అంతర్జాతీయ, జాతీయ మాజీ ఆటగాళ్ల ప్రాతినిధ్యం వహించడం విశేషం.

అంధుల క్రికెట్ టోర్నీకి ఆంధ్ర జట్టు

జాతీయ అంధుల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. ఫిబ్రవరి 2 నుంచి బెంగళూరులో జరిగే ఈ టోర్నీలో ఆంధ్ర అంధుల జట్టు పాల్గొనేందుకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సహాయ సహకారాలందించిందని విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ ప్రతినిధులు యడ్లపల్లి సూర్యనారాయణ, సురవరపు రామన్ సుబ్బారావు, ఇట్టూరి అజయ్‌కుమార్ తెలిపారు. టోర్నీకి ముందు ఆంధ్ర జట్టు ఆటగాళ్లు అనకాపల్లి గుల్లేపల్లి గ్రౌండ్‌లో ముమ్మర సాధన చేశారని, జాతీయ టోర్నీలో విజయం సాధిస్తామని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

అన్షుల్ గుప్తా సెంచరీ

జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక తొలి డివిజన్ లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం ఉక్కు స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కవలియర్స్ 70 పరుగుల తేడాతో ఎలమంచిలి సీసీపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కవలియర్స్ నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లకు 313 పరుగుల స్కోరు చేసింది. ఓపెనర్ అన్షుల్ గుప్తా అద్భుతమైన బ్యాటింగ్, సెంచరీతో (106) కదం తొక్కగా, జిజిఎస్.పృధ్విరాజ్ అర్థ సెంచరీ (57)తో చెలరేగాడు. ఎలమంచిలి బౌలర్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో ఎలమంచిలి సీసీ నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 243 పరుగులు చేయడంతో ఓటమి తప్పలేదు. డి.పి.రెడ్డి హాఫ్ సెంచరీ (59), యు.సాగర్ (42) రాణించినా ఫలితం లేకపోయింది.

ఆన్‌లైన్ సెక్స్ రాకెట్ కేసులో అయిదుగురి అరెస్టు

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సెక్స్ రాకెట్ నడుపుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలను వ్యభిచారంలోకి దింపుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఆన్‌లైన్ లో సెక్స్ రాకెట్ నడుపుతున్న పలువురిపై కేసు నమోదు చేసి అప్పట్లో 11 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో కొందరు పరారయ్యారు. ఈ క్రమంలో బుధవారం జి.గణేష్, జి.పవన్ కల్యాణ్, ఎన్.వెంకటలక్ష్మి, జి.పద్మ, పి.శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మానసిక రోగికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తిరుగుతున్న మానసిక రోగి సి.గౌతమ్ (40)ను టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. గౌతమ్‌ను గుర్తించిన రెండో పట్టణ పోలీసులు వసతిగృహనికి తరలించినట్లు చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా

... 5వ పేజీ తరువాయి

పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ఈ ప్రభావం గురువారం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఉంటుంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,444 కోట్ల ప్యాకేజీపై కర్మాగారం అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఉక్కు మంత్రి అధికారికంగా ప్రకటన చేయాలనుకున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఉక్కు కర్మాగారంలో పర్యటించవచ్చునని, కానీ...హామీలు, అభివృద్ధి పథకాలపై ప్రకటనచేయరాదని అంటున్నారు. అదేవిధంగా ఆంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఆ కార్యక్రమం వాయిదా పడింది. సుమారు ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికార పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

ఘనంగా బల్లల పండుగ


బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పందిమెట్ట జంక్షన్ సమీపంలోని ఊటగడ్డలో మడివాల మాచయ్య బల్లల పండుగ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఊటగడ్డ నుంచి బీచ్‌రోడ్డు దుర్గాలమ్మ ఆలయం వరకు బిందెలతో జలాలు, పూజా సామగ్రి తీసుకెళ్లి సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు, అన్నపూర్ణ, పారిశ్రామిక వేత్త రాజబాబు, విశాఖ రజక సంఘం అధ్యక్షుడు నూకరాజు, స్థానిక నాయకులు పోలుపల్లి సురేష్, కింతాడ శివ, సతీష్, శ్రీను, శివ, ఊటగడ్డ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక చర్యలు

ఆర్పీపేట హెచ్‌ఎం ఆర్. శ్రీనివాసరావు


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే ధ్యేయంగా ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఆర్పీపేట పాఠశాల హెచ్‌ఎం రావర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న 164 మంది విద్యార్థులకు డీసీఈబీ నుంచి కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్య సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులంతా పేద వర్గాలవారు కావడంతో ఉపాధ్యాయులు సమకూర్చిన నిధులతో స్టడీ మెటీరియల్‌ను కొనుగోలు చేసి అందించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ, వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ, ఆయా సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేయడం వంటివి కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.చంద్రశేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవిపై జడ్జి అనుచిత వ్యాఖ్యలు తగదు

కంచరపాలెం సీఐకి ఫిర్యాదు

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసన సభ్యురాలు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టరు ఉండవల్లి శ్రీదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పూర్వ జడ్జి రామకృష్ణ (సస్పెండెడ్)పై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కంచరపాలెం సీఐ శంకర నారాయణకు మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత బుధవారం ఫిర్యాదు చేశారు. డాక్టరు శ్రీదేవి గురించి రామకృష్ణ అసభ్యపదజాలం ఉపయోగించడంపై మండిపడ్డారు. సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి కనీసం మహిళ అని చూడకుండా మాట్లాడడం భావ్యం కాదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెతో పాటు ఉత్తర టీడీపీ మహిళలు శ్రీదేవి, లక్ష్మి, లావణ్య, సౌజన్య, ఆదిలక్ష్మి, పలువురు మాదిగ కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో దుర్గంధం



పూడికలతో నిండిన ప్రధాన కాలువ

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దుర్గానగర్ ప్రధాన కాలువ పూర్తిగా పూడికలతో నిండిపోయిం ది. దీని నుంచి దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, ఏ వ్యాధులు ప్రబలుతాయోనని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కాలువల్లో పూడికలు తీయకపోవడంతో తరచూ ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడికల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ తొమ్మిదో సెక్టరు అప్పుఘర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మీసాల విజయలక్ష్మి తన సోదరి జమ్ములక్ష్మి బుధవారం తెల్లవారు జాము నుంచి కనిపించడం లేదంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ కారణాలతో ఆమెను ఈ నెల 24న గుంటూరు నుంచి తన ఇంటికి తీసుకువచ్చామని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ కామత్ హోటల్ ఎదురుగా ఓ ద్విచక్ర వాహనదారుడు అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఓ వృద్ధుడిడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం వి.నటరాజ్ (77) నడకకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కామత్ హోటల్ సమీపంలో టి.శివరామచంద్రా రెడ్డి ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొన్నాడు. దీంతో నటరాజ్‌కు గాయాలయ్యాయి. ఎస్ ఐ జీ ధనుంజయ్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీ నరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం

- వ్యాపారాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అడుగులు
- ఎంఎస్ఎంఈ సర్వేతో వివరాలు సేకరణ
- తూర్పులో 98 శాతం పూర్తి



ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు

మద్దిలపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. కింది స్థాయి నుంచి వ్యాపారాభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఔత్సాహిక యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ర్యాంపు సర్వే చేపట్టింది. ఎంఎస్ఎంఈ సర్వేతో రాష్ట్ర ప్రభుత్వంనూతన పారిశ్రామిక విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాలను సేకరించడానికి సచివాలయ కార్యదర్శులు ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహిస్తున్నారు.

తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే 98 శాతం సర్వే పూర్తి చేశారు. సచివాలయ అడ్మిన్, శానిటేషన్ కార్యదర్శులు సర్వేలో పాల్గొని తమ పరిధిలోని అన్నీ రకాల వ్యాపారస్తుల వివరాలు సేకరిస్తున్నారు. తూర్పులో విద్యుత్ కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్సులు ఆధారంగా సుమారు 9 వేల చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ఉన్నాయి. వీటితో పాటు తోపుడు బండ్ల వ్యాపారస్తుల వివరాలు సైతం సర్వే చేస్తున్నారు.

సర్వే ఇలా...

సచివాలయాల పరిధిలోని దాదాపుగా అన్ని రకాల వ్యాపారస్తులకు సర్వే చేస్తున్నారు. దుకాణాలకు వెళ్లి ఎంఎస్ఎంఈ యాప్‌లో వ్యాపారస్తుల వివరాలు నమోదు చేస్తున్నారు.

వ్యాపారస్తుల ఆధార్, పాన్, రేషన్ కార్డుల వివరాలతో పాటు ఎప్పటి నుంచి వ్యాపారం నిర్వహిస్తున్నారు?ఎంత మంది పని చేస్తున్నారు? రుణాలు ఏమైనా తీసుకున్నారా? సంవత్సరాదాయం ఎంత? విద్యుత్ బిల్లు ఎంత వస్తోంది వ్యాపారం లాభాల్లో ఉందా, నష్టాల్లో ఉందా? ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలని కోరుకుంటున్నారు వంటి వివరాలను నమోదు చేస్తున్నారు. చిన్న వ్యాపారి నుంచి పెద్ద వ్యాపారస్తుల వరకు వారి వ్యాపార పరిస్థితులు తెలుసుకుని, తద్వారా వారికి అవసరమైన ప్రయోజనాలు కల్పించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

సిరిపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్పీల ఉద్యోగ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు.

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలను డ్వాక్రా గ్రూపుల్లోకి తీసుకొచ్చి అనేక సేవలందించిన ఆర్పీలకు ప్రభుత్వాలు ఇస్తున్న వేతనాలు చాలా తక్కువ అన్నారు. ఆ వేతనం కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలు ముగిసిన ప్రతీసారి ఆర్పీల మీద రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, ఆర్పీలు పార్టీ మనుషులు కాదని, ప్రభుత్వ ఉద్యోగులన్న విషయం గుర్తించాలన్నారు. ఆర్పీల పని విధానం బాగుందని అధికారులు పలు సందర్భాల్లో గుర్తించారన్నారు. అనుభవం గల ఆర్పీలను మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ ద్వారా తొలగించాలని ప్రయత్నం ఆలోచించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం జీవీఎంసీ ఏడీసీ, యూసీడీ పీడీలకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ నాయకులు పి.మణి, మల్లీశ్వరి, లత, ఝాన్సీ, సత్య, వరలక్ష్మీ, దేవి, లక్ష్మి, రత్నాలు, సన్యాసమ్మ, విశాలాక్షి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపు



బడ్డీలను తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్లను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేయడమే కాకుండా... అద్దెకు ఇచ్చి సొమ్ములు చేసుకుంటున్న వైనంపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మొద్దు నిద్ర వదలడం లేదు. కానీ పారిశుధ్య విభాగం అధికారులు మాత్రం తమ విధులకు ఇబ్బందిగా ఉన్న బడ్డీలను తొలగించారు. అయితే ఏ విభాగం వారు చేయాల్సిన పనిని ఆ విభాగం వారు చేయకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోని ఆక్రమణ బడ్డీల దుస్థితి. బుధవారం ఉదయం జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఈ ప్రాంతంలో పర్యటించి, ఇక్కడి సులబ్ కాంప్లెక్సు ఎదురుగా ఉన్న ఆటోస్టాండ్ పక్కనున్న చెత్తకుండీని ఆనుకుని అక్రమంగా, నిరుపయోగంగా ఏర్పాటు చేసిన బడ్డీలను వెంటనే తొలగించలని ఆదేశించారు.

ఈ బడ్డీలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించినా.. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయం సిబ్బంది మాత్రం వెంటనే స్పందించి చెత్తకుండీకి ఆనుకుని ఆక్రమించి నిరుపయోగంగా ఉన్న బడ్డీలను తొలగించారు. తమ విధులకు ఇబ్బందిగా ఉండడంతో ఆ మేరకు పారిశుధ్య సిబ్బంది తరలించారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో బడ్డీలను తొలగించాల్సిన ఉంది. కనీసం ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు దీనిపై తగిన శ్రద్ధ వహించాలని, వెంటనే ఆక్రమణ బడ్డీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరవాడ ఎంపీడీవో తీరుపై అనకాపల్లి కలెక్టర్ అసహనం

- విచారణకు ఆదేశం
- రక్త నమూనాలు సేకరించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది
- మరోవైపు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించిన సీఐ
- కార్యాలయ సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్న జడ్పీ డిప్యూటీ సీఈవో



ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్

పరవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఒక ఎంపీడీవో తీరుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు అనుమానం వచ్చింది. తాను అడుగుతున్న ప్రశ్నలకు ఎంపీడీవో పొంతనలేని సమాధానాలు చెబుతుండడం, వారిస్తున్నా వినకపోవడంతో తక్షణం విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తెలుగులో సమాధానం చెప్పాలని కలెక్టర్ చెబుతున్నప్పటికీ ఎంపీడీవో తన పంథాను మార్చుకోకుండా ఇంగ్లీషులో మాట్లాడుతుండడంతో అనుమానం వచ్చి విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయంత్రం ఆరు గంటలకు పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో ప్రవర్తన గురించి అక్కడ అధికారులతో పాటు సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్నారు. ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు కావస్తుంది. ఈ నాలుగు నెలల్లో ఎలా వ్యవహరించారన్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మద్యం మత్తులో విధులకు హాజరై, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారని విచారణలో బయటపడినట్టు తెలిసింది.

రక్త నమూనాలను సేకరించిన డీఎం అండ్ హెచ్‌వో

కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎం అండ్ హెచ్‌వో) రవికుమార్ సాయంత్రం ఐదు గంటలకు పరవాడ ఒకటి, రెండు సచివాలయాలకు చెందిన ఏఎన్ఎంలతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. అప్పటికే సీఐ తన సిబ్బందితో ఎంపీడీవోకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసినట్టు తెలిసింది.

బాలుర పరిశీలన గృహం సందర్శన

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి దీనదయాళ్‌పురంలో నిర్వహిస్తున్న బాలుర పరిశీలన గృహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బుధవారం సందర్శించారు.బాలలకు కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వంటకాలనురుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అంకితభావం, సేవా దృక్పథంలో పని చేయాలని కోరారు. నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని తొందరలో వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. చాలాకాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు చెప్పారు.

ఎర్రమట్టి దిబ్బలను సందర్శించిన విశాఖ వ్యాలీ స్కూలు విద్యార్థులు



ఎర్రమట్టి దిబ్బల సందర్శనలో విశాఖ వ్యాలీ స్కూలు విద్యార్థులు

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర పర్యటనలో భాగంగా విశాఖ వ్యాలీ విద్యార్థులు బుధవారం భీమిలి సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలను సందర్శించారు. విశాఖ జిల్లా ఇంటెక్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యురాలు రేణుకరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎర్రమట్టి దిబ్బలను పరిశీలించి అక్కడి భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రమట్టి దిబ్బల ప్రత్యేకతను రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.

గతంలో సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు వివిధ కారణాల వల్ల క్రమేపీ 450 ఎకరాలకు పరిమితం అయ్యాయన్నారు. ఇలాంటివి సౌదీ అరేబియా, నమీబియాలో ఉంటాయన్నారు. అలాంటి ప్రత్యేకత కొండలు విశాఖ సమీపంలో ఉండడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాం గ్రామంలో నివాసముంటున్న కింతాడ దేవి (35) భవన నిర్మాణ కార్మికురాలిగా పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంది. బుధవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని బయ్యవరం సమీపం జమ్మాదులపాలేనికి చెందిన దేవి 15 ఏళ్ల క్రితం తుంగ్లాం గ్రామానికి చెందిన ఆనందరావును ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా రెండేళ్ల కిందట ఆనందరావు భార్య, పిల్లలను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటినుంచి దేవి కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఇప్పుడు ఆమె మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం రేపు

ఎంవీపీ కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పైపులైన్లకు మరమ్మతులు కారణంగా శుక్రవారం జోన్-3 పరిధిలోని 17వ వార్డు ఎంవీపీ కాలనీ 1, 4, 5 సెక్టర్లు, 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టర్ 2, 3, 6, 7, 9, 10.., అలాగే 19వ వార్డు పరిధిలోని సెక్టర్ 11, వాసవానిపాలెం తదితర ప్రాంతాల్లో పైపు లైన్ల ద్వారా మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ టౌన్ సర్వీస్ రిజర్వాయరు నుంచి ఎండాడ రిజర్వాయరుకు వచ్చే ప్రధాన పంపింగ్ మెయిన్ లైను 900ఎంఎం డయా ఇసుకతోట నుంచి శివాజీపాలేనికి వెళ్లే మార్గంలో శ్మశాన వాటిక వద్ద మరమ్మతులకు గురైందని తెలిపారు.

ఉక్కు ఉద్యోగులు వాస్తవాలు గ్రహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు రక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రూ.11440 కోట్లు కేటాయించడం ద్వారా ప్లాంటు రక్షణకు కట్టు ఉన్నామన్న నమ్మకం కలిగించారని, అయితే కొందరు ఉక్కు ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించకుండా నిరసనలతో కాలం గడుపుతూ పరిస్థితిని సంక్లిష్టం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు ఆరోపించారు.బుధవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్డీఏ ప్రభుత్వం వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు రూ.2500 కోట్లు కేటాయించి స్టీల్‌ప్లాంట్‌కు అండగా నిలిచిందన్నారు. ఒకప్పుడు లాభాల బాటలో నడిచిన విశాఖ ఉక్కు పరిశ్రమ రాజకీయాల జోక్యం, అసమర్థ అధికారుల పాలనా వ్యవహారాల కారణంగా నష్టాలకు వెళ్లిందన్నారు. ఉద్యోగుల అస్తవ్యస్త పనితీరు కారణంగా ఉత్పత్తి గణనీయంగా తగ్గిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీఏ ప్రభుత్వం ప్లాంటుకు అండగా నిలిచిందని, పని తీరు మెరుగు పరచడంపై ఉద్యోగులు దృష్టి సారిస్తే మంచిదని పరశురామ్‌రాజు హితవు పలికారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) ఫిబ్రవరి 1నుంచి మార్చి 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22879/22880) ఫిబ్రవరి 1 నుంచి 23 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ కోచ్; సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20809/20810) ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (08311/08312) ఫిబ్రవరి 5 నుంచి 28 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; భువనేశ్వర్-జునాగర్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20837/20838) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు స్లీపర్ క్లాసు కోచ్; పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) ఫిబ్రవరి 7 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; భువనేశ్వర్-జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18447/18448) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటాయన్నారు.

మళ్లింపు మార్గంలో అమృతసర్ ఎక్స్‌ప్రెస్ రైలు

సంబల్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రతి బుధ, శని, ఆదివారాల్లో అమృతసర్‌లో బయలుదేరే అమృతసర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు (20808) ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 30 వరకు....అలాగే ప్రతి మంగళ, శుక్ర, శనివారాల్లో విశాఖలో బయలుదేరే విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్ (20807) రైలు ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 29 వరకు ఇరువైపుల సంబల్‌పూర్ స్టేషన్‌కు చేరకుండా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ పేర్కొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌లు కొనసాగింపు

విశాఖ మీదుగా భువనేశ్వర్-ముంబయి మధ్య రాకపోకలు సాగిస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (11019/11020) ఖర్దత్, షెహబాద్ స్టేషన్లలో తాత్కాలికంగా కల్పించిన అదనపు హాల్ట్‌లు కొనసాగుతాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఖర్దత్ స్టేషన్ హాల్ట్ ఫిబ్రవరి 7 నుంచి, షెహబాద్ స్టేషన్ హాల్ట్ మార్చి 3 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

పరస్పర సహకారంతో యువతకు ఉపాధి చూపండి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచన

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్య, నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక సంస్థలు పరస్పర సహకారం, ప్రణాళికతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. 'ఇంటరాక్షన్ ఆన్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ క్రియేషన్ ఇన్ విశాఖ రీజియన్' లక్ష్యంతో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదివిన చదువుకు తగిన ఉద్యోగం నిర్ణీత సమయంలో వచ్చేలా ప్రణాళికలు రచించాలని, ఉద్యోగాలకు తగ్గట్టు కోర్సులు అందించాలని ఆయా సంస్థలను కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సమన్వయంతో పనిచేసి భవిష్యత్‌లో స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. విద్యా సంస్థలు, పరిశ్రమలు నెలకోసారి ప్రత్యేకంగా సమావేశమై, అవసరాలను గుర్తించి తగిన అభ్యర్థులను ఖరారు చేసుకోవాలన్నారు. విద్యా నైపుణ్య శిక్షణ సంస్థలతో ముందుగానే ఒప్పందాలు చేసుకుని తగిన కోర్సులు ప్రవేశపెట్టేలా సంప్రదింపులు జరపాలన్నారు. ఈ సదస్సులో సీఐఐ ప్రతినిధి మురళీకృష్ణ, నీరజ్ సర్మా, గ్రంధి రాజేష్, ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర విభాగాల అధికారులు, ఐటీ, ఫార్మా, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులకు ప్రశంసలు



ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ (ఏఎస్ఆర్టీయూ) విశాఖలో నిర్వహించిన అథ్లెటిక్ మీట్ విజయవంతంగా నిర్వహించిన ఆర్టీసీ అధికారులకు డీజీపీ, ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజయనగరం జోనల్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

అక్రమాలకు చెక్ పెట్టి..గ్రీన్‌బెల్ట్‌కు దారిచూపి..!

మురళీనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని వేతనాల రూపంలో తీసుకుంటున్న అధికార యంత్రాంగం ప్రజోపయోగ పనులకన్నా, పలుకుబడి వర్గాలకు వత్తాసు పలకడం, వారి వ్యవహారాలను చూసీచూడనట్లు వదిలేయడం అప్పుడప్పుడు రివాజుగా మారింది. మురళీనగర్ బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఏఎస్ఎన్ మెగామాల్ వద్ద నిర్వాకమే ఇందుకు ప్రబల ఉదాహరణ. ఇదివరకు పచ్చని చెట్లతో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని నామరూపాల్లేకుండా చేసి మాల్‌కు హైవే నుంచి ప్రధాన మార్గం ఉండేలా సహకరించారు. ఇపుడు నగరమంతా ఏకరీతిన ఉండటం కోసం జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం రూ. కోట్లు వెచ్చించి హైవే రోడ్లకు ఇరువైపులా వేస్తున్న ఇనుప రక్షణ గ్రిల్స్‌ను అడ్డుకున్నారు. వారి మాల్ ఉన్నంత మేర గ్రిల్ వేయనీయకుండా జీవీఎంసీ యంత్రాంగాన్ని ప్రభావితం చేసి ప్రధాన ద్వారాన్ని తలపించేలా మార్చుకుని గ్రీన్‌బెల్ట్ మొత్తం మట్టి, కాంక్రీట్ పోసి, ఆపై నిర్మాణ సామగ్రి, క్రేన్లు అక్కడే నిల్వ చేస్తూ వారి సొంత యార్డులా వాడుకున్నారు. ఇపుడు రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం విశాఖ నగరపాలక సంస్థను పరుగులు పెట్టిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఇక్కడి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. ఆక్రమణలపై జీవీఎంసీకి ఫిర్యాదు చేసి దగ్గరుండి తొలగించారు. వారి స్థలం ఉన్నంత వరకే అనుమతుల మేరకు షాపింగ్ మాల్ నిర్మించాలని ఆ భవన యజమానులకు సూచించారు.


షాపింగ్ మాల్ ఆక్రమణలను తొలగించి ఏర్పాటు చేసిన కొత్త ఇనుప రక్షణ గ్రిల్స్

వాస్తవానికి వీరిది ఏపీఐఐసీ ప్లాన్

ఈ నిర్మాణం జరుగుతున్న ఏడు ఎకరాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం ఏపీఐఐసీ నుంచి వీరు కొనుగోలు చేసుకున్నారు. ప్లాన్ మంజూరు కూడా విజయవాడ ఏపీఐఐసీ కార్యాలయం నుంచే లభించింది. ఈ మేరకు వీరు 10 అంతస్తుల భవనం కడుతున్నారు. మూడు బేస్‌మెంట్ సెల్లార్లు, ఏడు అంతస్తులుగా ఇక్కడ రూపుదిద్దుకుంటున్న ఈ కట్టడం పనులు 2022 డిసెంబరులో ఆరంభించారు. వీరికి ప్లాన్ ప్రకారం ఏపీఐఐసీ రహదారులే ఉంటాయి. నేరుగా జీవీఎంసీ నాలుగు వరుసల హైవే రోడ్డు ప్లాన్‌లో లేదు. కానీ దారి పొడవునా కొనసాగుతున్న వాణిజ్య సముదాయాల మాదిరే వీరు ఈ దారిని ఎంచుకున్నారు. జీవీఎంసీ నిబంధనలు అతిక్రమించి వీరు చేపడుతున్న కట్టడాలకు ఇపుడు చెక్ పెట్టారు.

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

- మరోసారి పోటీ చేయనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ
- ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు
- పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి
- పీఆర్‌టీయూ మద్దతుతో శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేయనున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయల సంఘం ఇప్పటికే మద్దతు పలికాయి. పీడీఎఫ్ తరపున కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ నుంచి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్లను ఆయా సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. శ్రీనివాసులునాయుడుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ (అపస్) మద్దతు ప్రకటించింది. కాగా 2019 ఎన్నికల్లో ఫ్యాప్టో తరపున రఘువర్మ పోటీ చేసి విజయం సాధించారు. ఫ్యాప్టోలో ఉన్న సంఘాలు ఇప్పుడు కలిసి ఒకే అభ్యర్థికి మద్దతు ఇవ్వడం లేదు. రఘువర్మకు ఏపీటీఎఫ్-257, హెచ్ఎం అసోసియేషన్ మాత్రమే ప్రస్తుతానికి మద్దతు ప్రకటించగా, యూటీఎఫ్ ఈ పర్యాయం సీపీఎం అనుబంధంగా ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతు తెలిపింది. మరో సంఘం ఎస్టీయూ ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇదిలావుండగా నగరంలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్న వ్యక్తి ఒకరు ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే విశాఖ జిల్లా ఇంటర్ బోర్డు మాజీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ, ఆనందపురం మాజీ ఎంఈవో పద్మావతిలు నెల రోజుల నుంచి ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నారు.

కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు ఎవరికి మద్దతు పలుతాయనేది ఇంకా ప్రకటించలేదు. కూటమికి చెందిన ఒక ఎమ్మెల్సీ, మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు మాత్రం రఘువర్మకు అనుకూలంగా ఉన్నారు. అయితే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని ఉత్తరాంధ్రకు చెందిన కూటమి నేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మద్దతుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. విపక్ష పార్టీ వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘం ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58506/58505) ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18463/18464) ఫిబ్రవరి 1నుంచి మార్చి 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22879/22880) ఫిబ్రవరి 1 నుంచి 23 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ కోచ్; సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20809/20810) ఫిబ్రవరి 2 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (08311/08312) ఫిబ్రవరి 5 నుంచి 28 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు; భువనేశ్వర్-జునాగర్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20837/20838) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు స్లీపర్ క్లాసు కోచ్; పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) ఫిబ్రవరి 7 నుంచి మార్చి 1 వరకు (నామినేటెడ్ రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; భువనేశ్వర్-జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18447/18448) ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటాయన్నారు.

మళ్లింపు మార్గంలో అమృతసర్ ఎక్స్‌ప్రెస్ రైలు

సంబల్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్రతి బుధ, శని, ఆదివారాల్లో అమృతసర్‌లో బయలుదేరే అమృతసర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు (20808) ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 30 వరకు....అలాగే ప్రతి మంగళ, శుక్ర, శనివారాల్లో విశాఖలో బయలుదేరే విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్ (20807) రైలు ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 29 వరకు ఇరువైపుల సంబల్‌పూర్ స్టేషన్‌కు చేరకుండా మళ్లింపు మార్గంలో రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ పేర్కొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌లు కొనసాగింపు

విశాఖ మీదుగా భువనేశ్వర్-ముంబయి మధ్య రాకపోకలు సాగిస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (11019/11020) ఖర్జత్, షెహబాద్ స్టేషన్లలో తాత్కాలికంగా కల్పించిన అదనపు హాల్ట్‌లు కొనసాగుతాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఖర్జత్ స్టేషన్ హాల్ట్ ఫిబ్రవరి 7 నుంచి, షెహబాద్ స్టేషన్ హాల్ట్ మార్చి 3 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

డాబాగార్డెన్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జీవీఎంసీ పరిధిలోని మాంసాహార దుకాణాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు ముఖ్య వైద్యాధికారి డా.ఈఎన్‌వీ నరేష్‌కుమార్ తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారాలు వినియోగించరాదని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు విక్రయశాలలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు, అపరాధ రుసుము తప్పదని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంకు వినతి

డాబాగార్డెన్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును విజయవాడ సమీపంలోని ఉండవల్లిలో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి, ప్రధాన సమస్యలపై విన్నవించారు. దేవదాయశాఖ పరిధిలోని 22/ఏ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. యల్లమ్మతోట, పూతీవారిమాన్యం, అస్సాంగార్డెన్స్, వెంకటేశ్వరమెట్ట, కనకమహాలక్ష్మి ఆలయం ప్రాంతాల్లోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని తెలిపారు.


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఉత్సాహంగా పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడలు

కంచరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడల్లో బుధవారం కూడా వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్, బ్యాడ్మింటన్,టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. గురువారం ఫైనల్ పోటీలు జరుగుతాయి. కళాశాల ప్రిన్సిపాల్,క్రీడల సమన్వయకర్త డా.కె.నారాయణరావు, సహ సమన్వయకర్త డా.బి.జానకీరామ్‌ల ఆధ్వర్యంలో సాంకేతిక శాఖ ఆర్జేడీలు సత్యనారాయణ మూర్తి, నిర్మల కుమార్ ప్రియ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. గురువారం క్రీడల ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


హైజంప్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

నిజాన్ని నిక్కచ్చిగా చెప్పగలిగే శక్తి రచయితలదే: జయంతి ప్రకాశ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత జె.పి.శర్మ, చిత్రంలో ప్రభాకర్ తదితరులు

సీతంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమ రచనా వ్యాసంగాన్ని చిన్నతనంలోనే ప్రారంభించాలని, నిజం నిక్కచ్చిగా చెప్పగల సత్తా రచయితలకు ఉందని, వారు మార్గనిర్దేశం చేయాలని ప్రముఖ రచయిత జయంతి ప్రకాశ శర్మ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజం కళాశాలలో సహృదయ సాహితీ సమితి ఆధ్వర్యంలో బుధవారం కథాకచేరి కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శర్మ మాట్లాడుతూ సమాజంలో మార్పులను రచయితలు మాత్రమే సరిగా వ్యక్తీకరించగలగాలంటూ పలు సూచనలు చేశారు. ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రాసిన 'నొప్పుల నూకాలతల్లి' కథను డాక్టర్ కె.జి.వేణు పరిచయం చేశారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయకుమార్, రచయితలు సీహెచ్ సూర్యనారాయణ, డాక్టర్ డీవీ సూర్యారావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కేవీఎన్ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, అయ్యల సోమయాజుల ప్రసాద్, డీఎస్ కుమార్, ఉక్కు సాహితి రామారావు, రాంబాబు పాల్గొన్నారు.

పారాలీగల్ వాలంటీర్ కోసం 31లోగా దరఖాస్తు చేయాలి

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు న్యాయ సహాయం చేయాలనే ఔత్సాహికులు పారా వాలంటీర్లుగా పనిచేయడానికి ఈ నెల 31లోగా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, ఫొటోతో సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. కనీసం పదో తరగతి విద్యార్హత ఉండాలని, వివిధ సేవా సంస్థల్లో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైనవారికి జీతం, పారితోషికం ఉండవని స్పష్టంచేశారు. శిక్షణ అనంతరం ఎంపికైన వాలంటీర్లను ఏడాది కాలానికి నియమించనున్నట్లు పేర్కొన్నారు.

117 జీవో రద్దుకు డిమాండ్

అక్కయ్యపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నష్టం వాటిల్లే 117 జీవో రద్దు చేసి ఎస్‌జీటీ పోస్టులు పెంచి డీఎస్సీలో కలిపి ప్రకటించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. విద్యార్థులకు ప్రతి శనివారం స్కూల్ బ్యాగ్ లేని రోజు (నో బ్యాగ్ డే)గా ప్రకటించడం అభినందనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 117 జీవోను అమలు చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మూడు, నాలుగు, అయిదు తరగతుల విద్యార్థులను 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాలలకు తరలించడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లలేక ప్రైవేటు పాఠశాలల్లో చేరారన్నారు. కొంతమంది విద్యకు కూడా దూరమయ్యారని చెప్పారు. దీనివల్ల ఎస్‌జీటీ పోస్టులు కూడా తగ్గిపోయాయని పేర్కొన్నారు. 117 జీవోను తక్షణమే రద్దు చేసి పాత పద్ధతిలో పాఠశాలను నిర్వహించాలన్నారు.

మహా దోబూచులాట

... 5వ పేజీ తరువాయి

వేమనమందిరానికి జీవీఎంసీ జోన్-4 రెవెన్యూ అధికారులు మంగళవారం సీల్ వేశారు. ఎలాంటి బకాయి చెల్లించకపోయినప్పటికీ సీల్‌ను తొలగించి మళ్లీ ప్రైవేటు వ్యక్తులకే అప్పగించేశారు. జీవీఎంసీ పాలక వర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేత ఒకరు ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతోనే అధికారులు తలొగ్గి బకాయిలు చెల్లించకపోయినా సీల్‌ను తొలగించారని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పరిష్కారం దిశగా పంచ గ్రామాల భూ సమస్య

... 5వ పేజీ తరువాయి

జారీచేసింది. ఏ ప్రాంతం వారు ఎంత కట్టాలో ప్రకటించింది. జీవో నంబరు 578 ప్రకారం ఆక్రమిత భూమిని క్రమబద్ధీకరించుకోవడానికి 6,110 మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిలో 2,485 దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. ఇంకా 3,625 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమబద్ధీకరణ అంశంపై 2005లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కోర్టులో దాఖలైంది. ఈ భూ సమస్య పరిష్కారానికి దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూమి ఇవ్వడానికి 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు వచ్చింది. మొత్తం 547 ఎకరాలు ఇస్తామని ప్రతిపాదించింది. అయితే అప్పట్లో దేవస్థానం ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు అంత సుముఖత వ్యక్తం చేయలేదు. విశాఖపట్నంలో విలువైన భూమి తీసుకొని ప్రత్యామ్నాయంగా నగరానికి దూరంగా భూములు ఇస్తే తీసుకోలేమని స్పష్టంచేశారు. నగరంలోనే భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు పార్లమెంటు నియోజకవర్గాలు (విశాఖపట్నం, అనకాపల్లి), ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, పెందుర్తి)కు సంబంధించిన ఈ సమస్యపై తాజాగా ప్రభుత్వం మరోమారు కసరత్తు చేసింది. నగరంలోనే భూములు ఇచ్చేందుకు సిద్ధమైంది.

న్యాయస్థానం అంగీకరిస్తేనే..

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో బుధవారం చర్చలు జరిగాయి. ప్రత్యామ్నాయ భూములు తీసుకోవడానికి, కేసులు ఉపసంహరించుకోవడానికి దేవదాయ శాఖ అధికారులు అంగీకరించారు. న్యాయస్థానంలో వచ్చే తదుపరి వాయిదాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వివరిస్తారు. దానికి న్యాయస్థానం అంగకరిస్తే ఇది ముందుకు వెళుతుంది. ఈ విషయాన్ని సవివరంగా కోర్టుకు తెలియజేయాలని అడ్వకేట్ జనరల్‌కు సీఎం సూచించారు.

టమాటాకు భలే డిమాండ్


సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా కొనుగోలుకు ఎగబడుతున్న జనం

సీతమ్మధార, జనవరి 29: సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా కోసం బుధవారం జనం ఎగబడ్డారు. ధర తగ్గడంతో పాటు పెద్ద రైతుబజార్‌లలో ఒకటైన ఎంవీపీ, నరసింహనగర్ రైతు బజార్‌లకు సెలవులు కావడంతో సీతమ్మధారకు ఎక్కువమంది కొనుగోలుదారులు వచ్చారు. టమాటా ధర కిలో రూ.12 కావడంతో అమ్మకందారులైన రైతులకు గిట్టుబాటు కావటం లేదు. ధర ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి తెచ్చి అమ్మేవారు. ఇప్పుడు ధర తగ్గడం, విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడంతో మిగులు తక్కువగా ఉండడంతో అమ్మకానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడి, ఖర్చులు పెరగడంతో బయట బజార్ నుంచి రైతులు టమాటా కొనుగోలు చేయడం లేదు. దీంతో ఉదయం బజార్ తెరిచిన వెంటనే టమాటా కొనుగోళ్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పది గంటలకు వచ్చిన వారికి నాణ్యమైన టమాటాలు దొరకలేదు. బజార్‌లో ఒకే కౌంటర్‌లో టమాటా బాగుండటంతో కొనుగోలు చేయడానికి ఒకరిపై ఒకరు జనం ఎగబడ్డారు.

టెన్నిస్ మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుధవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ కోర్టులు వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫైయింగ్ రౌండ్‌ల నుంచి కొందరు మెయిన్ డ్రాకు అర్హత సాధించగా, సీడింగ్ ఆటగాళ్లు నేరుగా మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 35, 45, 55 ప్లస్ ఏజ్ గ్రూప్‌లకు సంబంధించి ఒక్కొక్క విభాగం నుంచి 32 మంది ఆటగాళ్లు పోటీపడనుండగా, 65 ప్లస్, 75 ప్లస్ రెండు విభాగాల నుంచి 32 మంది పాల్గొంటున్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లలో అంతర్జాతీయ, జాతీయ మాజీ ఆటగాళ్లు ప్రాతినిధ్యం వహించడం విశేషం.

అంధుల క్రికెట్ టోర్నీకి ఆంధ్ర జట్టు

జాతీయ అంధుల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. ఫిబ్రవరి 2 నుంచి బెంగళూరులో జరిగే ఈ టోర్నీలో ఆంధ్ర అంధుల జట్టు పాల్గొనేందుకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సహాయ సహకారాలందించిందని విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ ప్రతినిధులు యడ్లపల్లి సూర్యనారాయణ, సురవరపు రామన్ సుబ్బారావు, ఇట్లూరి అజయ్‌కుమార్ తెలిపారు. టోర్నీకి ముందు ఆంధ్ర జట్టు ఆటగాళ్లు అనకాపల్లి గుల్లేపల్లి గ్రౌండ్‌లో ముమ్మర సాధన చేశారని, జాతీయ టోర్నీలో విజయం సాధిస్తామని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

అన్షుల్ గుప్తా సెంచరీ

జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక తొలి డివిజన్ లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం ఉక్కు స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కవలియర్స్ 70 పరుగుల తేడాతో ఎలమంచిలి సీసీపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కవలియర్స్ నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లకు 313 పరుగుల స్కోరు చేసింది. ఓపెనర్ అన్షుల్ గుప్తా అద్భుతమైన బ్యాటింగ్, సెంచరీతో (106) కదం తొక్కగా, జిజెఎస్.పృథ్విరాజ్ అర్ధ సెంచరీ (57)తో చెలరేగాడు. ఎలమంచిలి బౌలర్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో ఎలమంచిలి సీసీ నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 243 పరుగులు చేయడంతో ఓటమి తప్పలేదు. డి.పి.రెడ్డి హాఫ్ సెంచరీ (59), యు.సాగర్ (42) రాణించినా ఫలితం లేకపోయింది.

ఆన్‌లైన్ సెక్స్ రాకెట్ కేసులో అయిదుగురి అరెస్టు

మహారాణిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సెక్స్ రాకెట్ నడుపుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలను వ్యభిచారంలోకి దింపుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్టు టూ టౌన్ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఆన్‌లైన్ లో సెక్స్ రాకెట్ నడుపుతున్న పలువురిపై కేసు నమోదు చేసి అప్పట్లో 11 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో కొందరు పరారయ్యారు. ఈ క్రమంలో బుధవారం జి.గణేష్, జి.పవన్ కల్యాణ్, ఎన్.వెంకటలక్ష్మి, జి.పద్మ, పి.శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

మానసిక రోగికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తిరుగుతున్న మానసిక రోగి సి.గౌతమ్ (40)ను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. గౌతమ్‌ను గుర్తించిన రెండో పట్టణ పోలీసులు వసతిగృహనికి తరలించినట్లు చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా

... 5వ పేజీ తరువాయి

పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ఈ ప్రభావం గురువారం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఉంటుంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,444 కోట్ల ప్యాకేజీపై కర్మాగారం అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఉక్కు మంత్రి అధికారికంగా ప్రకటన చేయాలనుకున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఉక్కు కర్మాగారంలో పర్యటించవచ్చునని, కానీ...హామీలు, అభివృద్ధి పథకాలపై ప్రకటనచేయరాదని అంటున్నారు. అదేవిధంగా ఆంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఆ కార్యక్రమం వాయిదా పడింది. సుమారు ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికార పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

1 నుంచి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వీల్ చైర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నామని ఆర్థోటిక్స్ ప్రోస్తెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఓపీఏఐ) ప్రతినిధులు తెలిపారు. మెడ్‌టెక్ జోన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ వీల్ చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) సహకారంతో ఈ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సహాయక సాంకేతికతను అభివృద్ధి చేయడం, సమ్మిళితత్వాన్ని పెంపొందించడం, వైకల్యమున్న వ్యక్తుల స్థితి స్థాపకతను లక్ష్యంగా పెట్టుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా ఓపీఏఐ 28వ సమావేశం కూడా నిర్వహించనున్నామని, దీని పురోగతిని చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా 600కు పైగా నిపుణులు, పరిశోధకులు విచ్చేస్తున్నారన్నారు. 93 శాస్త్రీయ ప్రజంటేషన్‌లు, 79 పోస్టర్ ప్రజంటేషన్‌లు, 34 స్టాళ్లతో కూడిన ఎక్స్‌పో ఉంటుందన్నారు. సమావేశంలో ఓపీఏఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరతాత్రన్ పాత్ర, ఉపాధ్యక్షుడు ఆనంద్‌భట్, జాతీయ కార్యదర్శి అజిత్ ప్రతాప్‌సింగ్, జాతీయ కోశాధికారి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగులు వాస్తవాలు గ్రహించాలి'

పెదవాల్తేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉక్కు రక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రూ.11440 కోట్లు కేటాయించడం ద్వారా ప్లాంటు రక్షణకు కట్టు ఉన్నామన్న నమ్మకం కలిగించారని, అయితే కొందరు ఉక్కు ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించకుండా నిరసనలతో కాలం గడుపుతూ పరిస్థితిని సంక్లిష్టం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్‌రాజు ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు రూ.2500 కోట్లు కేటాయించి స్టీల్‌ప్లాంట్‌కు అండగా నిలిచిందన్నారు. రాజకీయాల జోక్యం, అసమర్థ అధికారుల పాలనా వ్యవహారాల కారణంగా నష్టాలకు వెళ్లిందన్నారు.

పరవాడ ఎంపీడీవో తీరుపై అనకాపల్లి కలెక్టర్ అసహనం

- విచారణకు ఆదేశం
- రక్త నమూనాలు సేకరించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది
- మరోవైపు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించిన సీఐ
- కార్యాలయ సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్న జడ్పీ డిప్యూటీ సీఈవో


ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్

పరవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఒక ఎంపీడీవో తీరుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు అనుమానం వచ్చింది. తాను అడుగుతున్న ప్రశ్నలకు ఎంపీడీవో పొంతనలేని సమాధానాలు చెబుతుండడం, వారిస్తున్నా వినకపోవడంతో తక్షణం విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తెలుగులో సమాధానం చెప్పాలని కలెక్టర్ చెబుతున్నప్పటికీ ఎంపీడీవో తన పంథాను మార్చుకోకుండా ఇంగ్లీషులో మాట్లాడుతుండడంతో అనుమానం వచ్చి విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయంత్రం ఆరు గంటలకు పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో ప్రవర్తన గురించి అక్కడ అధికారులతో పాటు సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్నారు. ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు కావస్తుంది. ఈ నాలుగు నెలల్లో ఎలా వ్యవహరించారన్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మద్యం మత్తులో విధులకు హాజరై, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారని విచారణలో బయటపడినట్టు తెలిసింది.

రక్త నమూనాలను సేకరించిన డీఎం అండ్ హెచ్‌వో

కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎం అండ్ హెచ్‌వో) రవికుమార్ సాయంత్రం ఐదు గంటలకు పరవాడ ఒకటి, రెండు సచివాలయాలకు చెందిన ఏఎన్ఎంలతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. అప్పటికే సీఐ తన సిబ్బందితో ఎంపీడీవోకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసినట్టు తెలిసింది.

ఇటు గుడి.. అటు ఆస్పత్రి.. మధ్యలో వైన్ షాప్!

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఉన్నా పట్టించుకునే నాథులే కరువాయె..
- మందుబాబుల మూలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్న ప్రజలు



వడ్లపూడిలోని కుంచుమాంబ ఆలయం



ఆలయానికి 15 మీటర్ల దూరంలో ఉన్న వైన్ షాప్



మద్యం దుకాణానికి సమీపంలో ఉన్న కణితి పీహెచ్‌సీ

కూర్మన్నపాలెం, జనవరి 29: (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలకు చేరువలో మద్యం దుకాణాలు ఉండరాదన్న నిబంధనలు ఉన్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. 87వ వార్డు పరిధి వడ్లపూడి కూడలిలో ఏర్పాటు చేసిన వైన్ షాప్‌నకు ఒకపక్క ఆలయం, మరోపక్క ఆస్పత్రి ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైన్ షాపునకు ఒకపక్క సుమారు 15 మీటర్ల దూరంలోనే కుంచుమాంబ ఆలయం, మరోపక్క 15 మీటర్ల దూరంలో కణితి ప్రాథమిక ఆస్పత్రి ఉన్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇక్కడి వైన్ షాప్ వద్ద మందుబాబుల ఆగడాలు అధికంగా ఉంటున్నాయని, ఫూటుగా మద్యం సేవించిన మందుబాబులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు, మహిళలు, యువతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఉక్కు నిర్వాసిత కాలనీవాసులు వాపోతున్నారు. మద్యం సేవించాక ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

నిత్యం కణితి ప్రాథమిక ఆస్పత్రికి నిత్యం అనేక మంది రోగులు, గర్భిణులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి వెళుతుంటారు. అలాగే కుంచుమాంబ అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా మందుబాబుల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా ఈ రహదారి గుండా పలు పాఠశాలలు రాకపోకలు సాగించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అపెరల్ పార్కుకు, ఆటోనగర్, వీఎస్ఈజడ్ కర్మాగారాలకు విధులకు వెళ్లి వచ్చే మహిళా ఉద్యోగులు మందుబాబుల మూలంగా అవస్థలు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇప్పటికే గంజాయి బ్యాచ్‌ల వల్ల రాత్రి వేళల్లో వడ్లపూడి కూడలి బస్టాప్ నుంచి కణితి గాంధీ బొమ్మ సెంటర్ వరకు భయం భయంగా ఇళ్లకు వెళుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. మంగళవారం 87వ వార్డు తిరుమల నగర్‌లో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారుల సమక్షంలోనే వైన్ షాప్ వల్ల తలెత్తుతున్న సమస్యను వెళ్లగక్కారు. ఆలయాలు, విద్యాలయాలు, ఆస్పత్రులు, మసీదులు, చర్చిలు వంటి వాటికి వంద మీటర్ల దూరంలోనే మద్యం దుకాణాలు ఉండాలన్న ప్రభుత్వ నిబంధనలున్నా.. వడ్లపూడిలోని మద్యం షాపు మాత్రం ఇటు ఆస్పత్రికి, అటు ఆలయానికి కేవలం పదిహేను మీటర్లకు సమపీంలో ఉన్నా అధికారులులెవరూ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ నుంచి వైన్ షాపును దూరంగా తరలించాలని వారు కోరుతున్నారు.

అధికారులు తగిన చర్యలు చేపట్టాలి

-మాటూరి రాము, వడ్లపూడి



వడ్లపూడి జంక్షన్ వద్ద ఉన్న వైన్ షాపు వల్ల ఆలయానికి, ఆస్పత్రికి వస్తున్న భక్తులు, రోగులతో పాటు పలు పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్న విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబుల వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని వారంతా భయాందోళన చెందుతున్నారు. అలాగే కణితి గవర వీధి జంక్షన్ శివాలయం సమీపంలో కూడా ఓ వైన్ షాపు ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దూర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలి

ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించేలా యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలంటూ ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు పూర్తి స్థాయి వేతనాలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును పరిరక్షించేందుకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయడమే సరైన మార్గమన్నారు. ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు, వేతనాలు లేక ఉద్యోగులు, కార్మికులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కనీస అవసరాలను కూడా వారు తీర్చులేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉక్కు ఆస్పత్రిలో, క్యాంటీన్లలో సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయబోమని కేంద్ర స్పష్టమైన ప్రకటన చేయాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్‌రాజు, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, ఎస్ఏ నాయుడు, జి.మధుసూదన్, ఈశ్వరరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఊరుకోం

సిటీ ప్లానర్ మీనాకుమారి

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే తగిన చర్యలు చేపడతామని సిటీ ప్లానర్ మీనాకుమారి హెచ్చరించారు. 87వ వార్డు పరిధి కణితి కాళింగుల వీధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఇక్కడి ఆక్రమణలను తక్షణమే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ స్థలంలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణ రానున్నదని కార్పొరేటర్ బొండా జగన్ ఆమెకు వివరించారు. ఈ స్థలంపై పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని సిబ్బందికి ఆమె సూచించారు. సిటీ ప్లానర్ వెనక టౌన్ సర్వేయర్ జగదీశ్, టీపీవో వరప్రసాద్, డబ్ల్యూపీఆర్ఎస్ చొప్పా శ్రావణ్, టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎం.రాము, పి.దానయ్య, సిరసపల్లి శ్రీను, తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాం గ్రామంలో నివాసముంటున్న కింతాడ దేవి (35) భవన నిర్మాణ కార్మికురాలిగా పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంది. బుధవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని బయ్యవరం సమీపం జమ్మాదులపాలేనికి చెందిన దేవి 15 ఏళ్ల క్రితం తుంగ్లాం గ్రామానికి చెందిన ఆనందరావును ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా రెండేళ్ల కిందట ఆనందరావు భార్య, పిల్లలను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటినుంచి దేవి కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఇప్పుడు ఆమె మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాటరీల దొంగ అరెస్టు

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో సంచరిస్తూ బ్యాటరీలు దొంగిలిస్తున్న వ్యక్తిని దువ్వాడ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి సమీపంలోని కొండయ్యవలసకు చెందిన తాడిపూడి శంకర్ ఈ నెల 23న వడ్లపూడి పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్‌లో ఉన్న ఓ లారీకి చెందిన రెండు బ్యాటరీలను చోరీ చేశాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు క్రైమ్ సీఐ శ్రీనివాసరావు తన బృందాలతో నిఘా వేసి బుధవారం యాదవ జగ్గరాజుపేట పెట్రోల్ బంక్ వద్ద దొంగను పట్టుకుని అరెస్టు చేశారు. శంకర్‌పై ఐదు జిల్లాల్లో అరవైకి పైగా కేసులు ఉన్నాయి. నిందితుని వద్ద నుంచి పది బ్యాటరీలు, ఓ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

అగనంపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అగనంపూడిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం స్థానిక కూటమి నాయకులు రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం స్థల పరిశీలన చేశారు. అగనంపూడి సర్వే నంబర్-208/2లో గల ప్రభుత్వ భూమిని వారు తిలకించారు. స్థానికంగా సబ్ స్టేషన్ లేకపోవడంతో అగనంపూడి, ఉక్కు నిర్వాసిత పరిసర ప్రాంతాల్లో నిత్యం లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుంది. ఈ విషయమై ఈపీడీసీఎల్ అధికారులను కలిసి నాయకులు సమస్యను వివరించగా స్థలం కేటాయిస్తే సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం పరిశీలన చేసినట్టు కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మహేశ్, శ్రీనివాసరావు, ధనలక్ష్మి, కూటమి నాయకులు కొర్రాయి జగదీశ్, బి.చందూరమేశ్, బి.సత్యనారాయణ, జి.సత్యవతి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలలో వున్న వైద్య సిబ్బంది ముఖ హాజరును విధిగా వేయడంతో పాటు సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం సచివాలయాలను బుధవారం సందర్శించిన ఆయన సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. ఓపీ, ఐపీ, ఈహెచ్‌పీ, డయాగ్నోస్టిక్ సేవలతో పాటు మందులు, వాటి లభ్యత, తదితర అంశాల గురించి ఆయన వివరించారు. వైద్య అధికారులు, సిబ్బందికి కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవల గురించి తెలయజేశారు. డీఎంహెచ్‌వో వెంట పలువురు వైద్యాధికారులతో పాటు సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని సిద్ధార్థనగర్‌లో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, వడ్లపూడి, సగర వీధుల్లో రూ.75 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో రూ.10 కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బి.నాగేశ్వరరావు, రాజన్ రాజు, ఎం..రాము, దానయ్య, సత్తిబాబు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

అగనంపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవాణాశాఖ ఎంవీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు రహదారి భద్రత గురించి విద్యార్థులకు వివంచారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ వాహనాలను నడిపితే ప్రమాదాల బారినపడితే ప్రాణాలు కోల్పోతారని, విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, కో-ఆర్డినేటర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పెరగనున్న భూముల ధరలు



కూర్మన్నపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, మల్కాపురంలో యథాతథం

ఒకటో తేదీ నుంచి అమలు..

గాజువాక సబ్ రిజిస్ట్రార్ టి.తారకేశ్

అక్కిరెడ్డిపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పలుచోట్ల భూముల ధరలు పెరగనుండగా, కొన్నిచోట్ల పాత రేట్లే కొనసాగనున్నాయని సబ్ రిజిస్ట్రార్ టి.తారకేశ్ తెలిపారు.

తమ కార్యాలయ పరిధిలో గల మింది, అక్కిరెడ్డి పాలెం, మల్కాపురం, కూర్మన్నపాలెం, గుల్లలపాలెం ప్రాంతాల్లోని భూముల ధరలను 2023 జూన్ నెలలోనే పెంచినందున ప్రస్తుతం వాటి మార్కెట్ రేట్లలో ఎటువంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ఈ పరిధిలో ఉన్న లేఅవుట్‌లు, ప్లాట్లు, అపార్టుమెంట్ల ధరల్లో ఎటువంటి పెంపు జరగలేదన్నారు. సుమారు ఏడేళ్లుగా గాజువాక పరిధిలో భూముల ధరల పెంపు జరగనందున, ఫిబ్రవరి ఒకటి నుంచి రూ.22 వేలు ఉన్న గజం స్థలం విలువ 32 వేలకు పెంచడం జరిగిందని తెలిపారు. నరవ, జగ్గరాజుపేట పరిధిలో ప్రస్తుతం ఉన్న గజం రూ.ఏడు వేల నుంచి రూ.12 వేలకు, కణితి పరిధిలో రూ.12 వేల నుంచి రూ.16 వేలకు, ములగాడలో రూ.15 వేల నుంచి 17 వేల రూపాయలకు ప్రభుత్వం ధరలను పెంచడం జరిగిందని తారకేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వం పెంచిన ఈ ధరలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

గాజువాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి గురువారం స్టీల్‌ప్లాంటుకు విచ్చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు బుధవారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టు నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. స్టీల్‌ప్లాంటుకు భారీ ప్యాకేజీ ప్రకటించిన తర్వాత స్టీల్ ప్లాంటుకు కేంద్ర మంత్రి రానున్నందున భారీ ఏర్పాట్లు చేస్తున్నామని కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు.

అలాగే కేంద్ర మంత్రి కుమారస్వామికి స్వాగతం పలికేందుకు కూటమి నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం సహకారంతో ప్లాంటుకు అన్ని విధాల అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అంగ కృష్ణ, వెంకటరావు, ఉగ్రం, పెంటారావు, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న పరశురామరాజు, కరణంరెడ్డి, తదితరులు



కొండపైన చదును చేసిన స్థలం

ప్రభుత్వ స్థలం ఆక్రమణ?

మల్కాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీ కొండ మీద సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ స్థలంపై కొందరు వ్యక్తులు కన్ను వేశారు. అక్కడ గుడి నిర్మిస్తామని చెప్పి స్థలాన్ని చదును చేయడంతో పాటు జీవీఎంసీ పైప్ లైన్ నుంచి ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం సుమారు వెయ్యి గజాల వరకు ఉంటుంది. దీనిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుడి నిర్మాణానికి సెంటో, రెండు సెంట్లు సరిపోతుందని, కానీ వెయ్యి గజాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. పలువురు ఫిర్యాదు చేయడంతో ములగాడ తహసీల్దార్ భుజంగరావు ఆదేశాల మేరకు సిబ్బంది బుధవారం స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కొంత మంది గుడి నిర్మాణానికి అని చెప్పగా, మరి కొందరు కబ్జా చేసి, అమ్మేసే ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది విచారణ జరుపుతున్నారు.

ఆక్రమణలపై విచారణ

పెందుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెర్రిపోతులపాలెంలో సర్వే నెంబర్ 79/4లో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణపై రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఈమేరకు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తన కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, సర్వేయర్, వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఎంతమేర స్థలం ఆక్రమణకు గురైందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత తలెత్తకుండా బందోబస్తు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ పోలీసులకు లేఖ ద్వారా తెలియజేశారు.

అభివృద్ధి పనులు పరిశీలన

సింధియా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 63వ వార్డులోని కాకరలోవ, చింతలలోవ, క్రాంతినగర్‌లో రూ. 8 కోట్ల జీవీఎంసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని నివాసాలు పూర్తి స్థాయిలో కొండవాలు ప్రాంతంలో ఉండడంతో రిటర్నింగ్ వాల్, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు త్వరగా చేపడుతన్నామన్నారు. ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. ఆయనతో పాటు స్థానిక నేతలు ఉన్నారు.

పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తొలి అడుగు వేసిందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వరాహలక్ష్మీ నృసింహస్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూ సమస్య పరిష్కారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఇప్పటికే సమస్య పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలపై నగరానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలతో చర్చించారని, బుధవారం ఆయన అమరావతిలో మరోసారి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనంరామ్ నారాయణరెడ్డి, నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సమస్య పరిష్కారానికి త్వరలోనే కోర్టుకు అటు ప్రభుత్వం, ఇటు పిటిషనర్లు అఫిడవిట్స్ సమర్పించనున్నారని తెలిపారు.ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి భూమి బదలాయించేందుకు అంగీకారం కుదిరిందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో భూ సమస్య కదలిక లేకుండా నిలిచిపోయిందని, ఎన్నికల హామీ మేరకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్టు గంటా పేర్కొన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుతో కూడా చర్చించి, ఆయన అనుమతి కూడా తీసుకోనున్నట్టు చెప్పారు. తొలిదశలో 12142 నిర్మాణలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కోర్టు అనుమతితో త్వరలోనే వారికి సింహాచలంలో ప్రత్యేక బహిరంగ సభ ఏర్పాటు చేసి, పట్టాలు అందజేస్తామని తెలిపారు. మలిదశలో ఖాళీస్థలాలు, రైతుల హక్కులు తదితర అంశాలను కూడా పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి అభివృద్ధి, విజినిగిరిపాలెం గ్రామ సమస్యల పరిష్కారికి కూడా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

పద్మనాభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...గంజాయిని దేవరాపల్లి మండలం వంటవానిపాలెం నుంచి తీసుకువచ్చి కుర్రపల్లిలోని మామిడితోటలో ప్యాకెట్లు తయారు చేసి, విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వెళ్లగా ముగ్గురు వ్యక్తులు 1.50 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కుర్రపల్లికి చెందిన నిమ్మకాయల సాయిప్రసాద్, ఆనందపురం మండలం పందలపాకకు చెందిన తమట ప్రేమ్‌గోపాల్, దేవరాపల్లి మండలం వంటవానిపాలెంకు చెందిన పాలాకి బొర్సులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెందుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సుజాతనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చినముషిడివాడ 33/11 కేవీ రత్నగిరినగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్ఐసీ కాలనీ, ఎస్ఏడీ లేఅవుట్, రత్నగిరి లేఅవుట్, 80 అడుగులు రోడ్డు, సూర్యానగర్, గొల్లవిల్లిపాలెం, శతాబ్దినగర్, వైటుకే పార్క్, హైటెక్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వేపగుంట : ఎస్ఎస్ పురుషోత్తపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్‌బీ నగర్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సరఫరా నిలిపివేయనున్నారు. ఎల్‌బీ నగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, సేనాతివానిపాలెం, వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని వినియోగదా రులు గమనించాలని అధికారులు కోరారు.

11 మంది వాహనదారులకు జరిమానా

పెందుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మందికి రెండో స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు జడ్జి రూ. 1.10 లక్ష జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వేపగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు శ్రీనివాసస్వామి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూజలు అనంతరం అన్న సంతర్పన, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఉంటాయన్నారు.

కాలువలో పూడిక తొలగింపు

వేపగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం మెయిన్ రోడ్డులో ఉన్న కాలువలో పేరుకుపోయిన పూడికను జీవీ ఎంసీ సిబ్బంది బుధవారం తొలగించారు. భరత్‌నగర్ నుంచి విరాట్‌నగర్ వరకు ఉన్న ప్రధాన కాలువలోని పూడికలను బాబ్‌కాట్ మెషిన్ ద్వారా తొలగించారు.

సినిమా గైడ్

- **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

నైపుణ్య శిక్షణ.. ఉపాధి కల్పన

నిరుద్యోగుల ఆశా కిరణం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- స్కిల్ ఇండియాలో భాగంగా నగరంలో ఏర్పాటు
- ఆర్థికంగా సహకరిస్తున్న ఆయిల్ కంపెనీలు
- ఇప్పటివరకు 24 వేల మందికి శిక్షణ
- 80 శాతం మందికి ఉపాధి కల్పన
- ఉచిత వసతి, భోజన సదుపాయం
- 26 కోర్సుల్లో.. మూడు నెలల తర్ఫీదు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రం

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

దేశంలోని నిరుద్యోగ యువత నైపుణ్యం మెరుగుపరచడంతో పాటు ఉపాధి కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందదులో భాగంగా వివిధ సంస్థల సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్‌ను ఏర్పాటు చేసింది. దేశంలోని ఆరుచోట్ల నెలకొల్పిన ఈ నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో ఒకటి 2016లో నగరంలో ఏర్పాటయింది. ఇప్పటి వరకు 24వేల మంది యువతకు శిక్షణ అందించగా, 80 శాతం మందికి ఉపాధి కల్పించారు.

నగరంలోని ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని సువిశాల భవంతిలో ఏర్పాటుచేసిన నైపుణ్య శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం 26 కోర్సుల్లో (ట్రేడులు) శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఐదు అంతస్తుల్లోని ఈ భవనంలో శిక్షణతోపాటు వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, హెచ్‌పీ, ఇండియన్ ఆయిల్, గెయిల్, ఇంజనీర్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్), భారత్ పెట్రోలియం, బాల్మెర్ లారెయి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి. ప్రతినెలా విద్యార్థుల శిక్షణ, వసతి, అద్దెకు రూ.కోట్లు వ్యయమవుతోంది.

నైపుణ్య శిక్షణకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, పీజీ పూర్తిచేసిన నిరుద్యోగులు అర్హులు. 18 నుంచి 27 ఏళ్లలోపు వయసుండాలి. ప్రస్తుతం ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ఇండస్ట్రియల్ వెల్డర్, ఎల్‌పీజీ డెలివరీ పర్సనల్, ఎల్‌పీజీ మెకానిక్, పైప్ ఫిట్టర్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్, రిటైల్ ఔట్‌లెట్ అటెండెంట్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, మాన్యువల్ మెట ల్ ఆర్క్ వెల్డింగ్, అసిస్టెంట్ మెయింటెనెన్స్, అసిస్టెంట్ మాన్యు ఫ్యాక్చరింగ్ అండ్ ప్యాకేజింగ్, కెమిస్ట్, ప్రొడక్షన్, ల్యాబ్ టెక్నీషియన్, రీసెర్చ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, సోలార్ ఇన్‌స్టాలర్, ఆఫీస్ అసిస్టెంట్, ప్లంబర్ జనరల్, రిటైల్ సేల్స్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, డేటా ఫీడర్ - వేర్ హౌస్, ఇన్వెంటరీ క్లర్క్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్టు ఫోలియో మేకప్ ఆర్టిస్ట్, డ్రాఫ్ట్‌మన్ మెకానికల్, బ్యూటీషియన్, జనరల్ డ్యూటీ అటెండెంట్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు 25 కార్పొరేట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల్లో కనిష్ఠంగా 52 రోజుల నుంచి 90 రోజుల వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలను కల్పిస్తారు. వేతనం రూ.15 వేల నుంచి సామర్థ్యం, ప్రతిభను బట్టి రూ.30 వేల వరకు లభిస్తుంది.

ఉపాధి కల్పించడమే ధ్యేయం



ఈ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే ధ్యేయం. 2016లో ప్రారంభమైన కేంద్రం ద్వారా 24 వేల మందికి అనేక రంగాల్లో శిక్షణ ఇచ్చాం. 80 శాతం మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం. కుటుంబానికి అండగా నిలవాలని భావించే వారికి శిక్షణ దోహదపడుతుంది. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న వారిలో అధికశాతం మంది ఫార్మా రంగంలో అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. అనేక సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి. యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

- మియాజ్ అర్షద్, సీఈవో అండ్ సెక్రటరీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్



నిరుద్యోగులకు ప్రాక్టికల్స్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

అడ్వాన్స్‌డ్ పరికరాలపై శిక్షణ..

శిక్షణ కేంద్రంలో అత్యాధునిక పరికరాలు, అడ్వాన్స్ విధానంలో శిక్షణ ఇస్తున్నారు. పరిశ్రమల్లో నేరుగా పనిచేసే అనుభవాన్ని పొందేలా అత్యంత ఖరీదైన వర్చువల్ త్రీడీ ల్యాబ్స్‌లో శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం పది తరగతి గదులు, 23 ల్యాబ్ అండ్ క్లాస్‌రూమ్స్, ఆరు కంప్యూటర్ ల్యాబ్స్ ఉన్నాయి. 60 మంది సిబ్బంది విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు.

శిక్షణ పొందాలంటే..

ఈ కేంద్రంలో నిర్వహించే కోర్సుల్లో ఉచితంగా ఎవరైనా శిక్షణ పొందవచ్చు. నేరుగా గానీ, ఫోన్‌లోగానీ సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న 800 మందిలో సుమారు 90 శాతం మంది ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారే. ఈ కేంద్రం నిర్వహణను సీఈవో అండ్ సెక్రటరీ మియాద్ అర్షద్, చీఫ్ మేనేజర్ ఇంద్రజిత్ ముఖర్జీ, సీనియర్ మేనేజర్లు ఎన్‌టీవీఎస్ మూర్తి, కేఆర్ కిరణ్‌కుమార్, మేనేజర్ ఎస్ఎన్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ పర్యవేక్షిస్తున్నారు. శిక్షణకు హాజరుకావాలనుకునే విద్యార్థులకు నేరుగా సంప్రదిస్తే సహకరిస్తామని సీనియర్ మేనేజర్ ఎన్టీవీఎస్ నాయుడు తెలిపారు. లేదా 9442208334 నంబరులో సంప్రతించవచ్చని సూచించారు.



శిక్షణ అనంతరం ఉద్యోగాలు సాధించిన వారితో శిక్షణ కేంద్రం నిర్వాహకులు (ఫైల్ ఫొటో)

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించింది. ఏడు రోజుల ప్యాకేజీకి సరికొత్త సూపర్ లగ్జరీ (2+2 పుష్‌బ్యాక్ సీట్లు) బస్సులు నడపనున్నట్టు రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. ఈ సర్వీసులు ఫిబ్రవరి 4, 8, 12 తేదీల్లో విశాఖపట్నం డిపో నుంచి బయల్దేరుతాయన్నారు. ఒక్కొక్కరికి చార్జీ రూ.8వేలుగా నిర్ణయించామన్నారు. ప్రయాగరాజ్‌తో పాటు అయోధ్య, వారణాశి క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రయాగరాజ్‌లో ఒక రోజు, కాశీలో ఒక రోజు బస్సులు ఆగుతాయని, వసతి, భోజన సదుపాయాలను ప్రయాణికులే చూసుకోవాలన్నారు. టికెట్‌లో పిల్లలకు రాయితీ ఉండదన్నారు. సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారు ద్వారకా కాంప్లెక్సులోని బుకింగ్ రిజర్వేషన్ కౌంటర్ నుంచి పొందవచ్చునని, లేదా www.apsrtconline.in వెబ్‌సైట్‌నుంచి కానీ పొందవచ్చునన్నారు. వివరాలకు 9959225594, 9052227083 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రఘువర్మకు ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయనున్న పాకలపాటి రఘువర్మకు ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాతూరి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశం జరిగింది. విశాఖ జిల్లా అధ్యక్షుడు వైవీ వేణుగోపాల్ అధ్యక్షత జరిగిన సమావేశంలో రఘువర్మకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉత్తరాంధ్ర జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

రాజమండ్రి సెంట్రల్ జైలుకు ఖైదీల తరలింపు

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న కొందరు ఖైదీలను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలిస్తున్నట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందని, రోజుకు 20 మంది చొప్పున ప్రత్యేక బస్సులో పటిష్ఠ బందోబస్తు మధ్య తరలిస్తున్నామన్నారు. పది రోజుల్లో మొత్తం 200 మందిని తరలిస్తామని చెప్పారు. జైళ్ల శాఖ ఆదేశాల మేరకు పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం విశాఖ జైలులో రెండువేల మంది ఖైదీలు ఉన్నారన్నారు.

ఐదుగురు జైలు సిబ్బందికి మెమోలు

ఆరిలోవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో ఓ ఖైదీ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఉదంతంలో ఐదుగురు సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి విశ్వజిత్‌కుమార్ చార్జ్‌మెమోలు జారీ చేశారు. జైలులోని గోదావరి బ్యారెక్స్‌లో గత ఏడాది జూలై 30న ఉప్పాడ గౌరీశంకర్ (20) బాత్‌రూమ్ వెంటిలేటర్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన కమిటీ ఇందుకు ఐదుగురు జైలు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తేల్చింది. ఈ నేపథ్యంలో అప్పటి డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రస్తుతం కడపలో పనిచేస్తున్న కమలాకర్, జైలర్ కుసుమకుమార్, డిప్యూటీ జైలర్ సింహాచలంనాయుడు, హెడ్ వార్డర్ డీవీ రమణమూర్తి, వార్డర్ వాసుదేవరావులకు చార్జ్‌మెమోలు జారీ అయ్యాయి.

నేటి నుంచి ఆర్థో వైద్య నిపుణుల సదస్సు



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, కేజీహెచ్ ఆర్థో విభాగం ఆధ్వర్యంలో గురువారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సు వివరాలను వెల్లడించారు. ఎక్స్‌లెన్స్ ఎక్రాస్ ఆల్ డైమన్షన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ అనే నినాదంతో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. సదస్సులో వేయి మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటారన్నారు. ఒకటో తేదీన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతారని, తొలిరోజు సదస్సుకు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు హాజరవుతారన్నారు. 400 మంది ఎముకల శస్త్ర చికిత్స నిపుణులు పాల్గొంటారని వివరించారు. పాలీ ట్రామా, ఓపెన్ మేనేజ్‌మెంట్ అనే థీమ్‌తో గంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ నేతృత్వంలో ఆరుగురు వైద్యుల బృందం లైవ్ ప్రజెంటేషన్ ఇస్తుందన్నారు. డాక్టర్ రమేష్ సేన్ పాత్రో, డాక్టర్ మిలాన్ చౌదరి, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ గురవారెడ్డి వంటి ప్రముఖులు హాజరవుతున్నట్టు వివరించారు. సమావేశంలో సదస్సు నిర్వాహకులు బీవీఆర్ఎన్ వర్మ, డాక్టర్ బి.లీలాప్రసాద్, డాక్టర్ టి.భవానీప్రసాద్, డాక్టర్ ఎం.చంద్రశేఖర్ నాయుడు, డాక్టర్ వీవీ రాజశేఖర్, డాక్టర్ సంతోష్ రామ్ పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ విశాఖ నగర పరిధిలోని అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

విభాగం	అధ్యక్షుడి పేరు	నియోజకవర్గం
యువజన	దొడ్డి కిరణ్	పశ్చిమ
మహిళా	పేడాడ రమణకుమారి	ఉత్తర
బీసీ సెల్	సనపల రవీంద్ర భరత్	దక్షిణ
ఎస్సీ సెల్	బోని శివరామకృష్ణ	తూర్పు
మైనారిటీ సెల్	బర్కత్ అలీ	ఉత్తర
క్రిస్టియన్ మైనారిటీ	అడెపల్లి రవిబాబు	గాజువాక
విద్యార్థి	పులగం కొండారెడ్డి	తూర్పు
మునిసిపల్	సేనాపతి అప్పారావు	ఉత్తర
వలంటీర్స్	పీలా ప్రేమకిరణ్‌జగదీశ్	తూర్పు
వాణిజ్య	సకలాభక్తుల ప్రసాదరావు	దక్షిణ
చేనేత	చిక్కాల సత్యనారాయణ	గాజువాక
కార్మిక	రాయపు అనిల్‌కుమార్	పశ్చిమ
లీగల్‌సెల్	మేడిది ఆనందరావు	పశ్చిమ
సోషల్‌మీడియా	బొండా ఉమామహేశ్వరరావు	తూర్పు
దివ్యాంగుల	వాసుపల్లి ఎల్లాజీ	తూర్పు
బూత్ కమిటీ	గున్నంటి పూర్ణానందశర్మ	గాజువాక

వైభవంగా అప్పన్న తెప్పోత్సవం

- కృష్ణాలంకారంలో పుష్కరిణిలో విహరించిన స్వామి
- భారీగా తరలివచ్చిన భక్తులు

సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. పుష్యమాస బహుళ అమావాస్య సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు శిరస్సున నెమలి పింఛం, చేతిలో పిల్లనగ్రోవితో కృష్ణునిగా స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామిని, ఉభయ దేవేరులను పల్లకిలో ఉంచి మెట్లమార్గంలో ఛత్రం, చామరం, మంగళవాయిద్యాలతో కొండదిగువకు తీసుకువచ్చారు. తొలి పావంచా వద్ద దేవస్థానం పర్యవేక్షణాధికారి సత్యవాణి, గ్రామస్థులు స్వామికి ఆహ్వానం పలికారు. తొలిపావంచా నుంచి కళాకారుల కోలాటాలు, సన్నాయి వాయిద్యాల నడుమ వరాహ పుష్కరిణికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉంచిన హంసాకృతి పుష్పనౌకలో స్వామిని ఉంచి, పుష్కరిణి మధ్యలోని మండపానికి ముమ్మారు ప్రదక్షిణలు చేయించి మండపంలోనికి తీసుకువెళ్లారు. అక్కడ వైదికులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పండితులు చతుర్వేదాలను పఠించగా, స్థానాచార్యులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఈ సందర్భగా పుష్కరిణి ఉత్తరగట్టుపై కళ్లు మిరిమిట్లు గొల్పేలా బాణసంచా కాల్చారు. తూర్పున ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రాత్రి కొండదిగువ ప్రధాన మూడు మాడవీధుల్లో సర్వజన మనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది, స్వామిని కర్పూర నీరాజనాలతో ఆహ్వానం పలికారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గోపాలపట్నం సీఐలు గొలగాని అప్పారావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఏఈఓ ఆనందకుమార్, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



హంసాకృతి నౌకపై విహరిస్తున్న స్వామి



స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా



మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు

డీఆర్ఎం కార్యాలయం ఎదుట లోకో పైలట్ల నిరసన

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ మేనేజర్ కార్యాలయం ఎదుట లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు, ట్రైన్ మేనేజర్లు కలిసి బుధవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్‌వీఎస్ఎస్ రావు మాట్లాడుతూ, మినిమమ్ గ్యారెంటీ కిలోమీటర్ల కోసం తాము రెండేళ్లుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. మైలేజీకి పనితీరు లింకు పెట్టడం వల్ల ఉద్యోగులకు వచ్చే అలవెన్స్ తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమయ పాలనకు అనుగుణంగా గతంలో ఇచ్చినట్టుగానే అలవెన్సులు ఇవ్వాలన్నారు. డిమాండ్లను అంగీకరించే వరకు ప్రతి రోజు నిరసన తెలుపుతామని, ఆ తరువాత విధులను బహిష్కరిస్తామన్నారు.



డీఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లోకో పైలట్లు

హాహాకారాలు... ఆర్తనాదాలు

- రంగంలోకి సహాయక బృందాలు
- హుటాహుటిన క్షతగాత్రుల తరలింపు
- విమానాశ్రయంలో గందరగోళం
- మాక్ డ్రిల్ అని తెలుసుకుని రిలీఫ్

గోపాలపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు టెర్మినల్ భవనంలోకి వెళ్తున్నారు. సమయం సరిగ్గా ఉదయం 10 గంటలు. సెల్‌ఫోన్‌లలో తుపాను హెచ్చరిక సమాచారం ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి. బలమైన ఈదురుగాలుల కారణంగా టెర్మినల్ భవనంలో పైకప్పు లేని ప్రదేశం నుంచి ఆర్తనాదాలు, హాహాకారాలతో విమానాశ్రయం హోరెత్తింది. అధికారుల సమాచారంతో ఎన్డీఎంఏ, ఎస్డీఎంఏ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, పోలీస్ మెడికల్, పీఆర్, ఆపదమిత్ర వలంటీర్లు చేరుకుని టెర్మినల్ భవనంలో చిక్కుకున్న క్షతగాత్రుల్ని వెలికితీస్తున్నాయి. వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు చేశారు. 108 వాహనాల్లో నగరంలోని ఆస్పత్రులకు తరలించారు. అధికారులు పరామర్శించి ధైర్యాన్ని చెబుతున్నారు. అప్పటికే పెద్దసంఖ్యలో జనం చేరారు. అయితే ఇదంతా మాక్ డ్రిల్‌లో భాగమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యం లో బుధవారం నిర్వహించిన మాక్‌డ్రిల్ అబ్బురపరచింది. సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ,ఆస్తినష్టం తగ్గించడమే లక్ష్యంగా మాక్‌డ్రిల్ దోహదపడుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. హుద్‌హుద్ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖను వేగంగా కోలుకునేలా చేశారన్నారు. క్షేత్రస్థాయిలో విపత్తులను ఎదుర్కొనేలా 14వేల మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా, ఢిల్లీ నుంచి ఎన్డీఎంఏ మెంబర్ సయ్యద్ అటా హుస్సైన్, మేజర్ జనరల్ ఏకే వర్మ సూచనలిచ్చారు.



టెర్మినల్‌లో రేగిన మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది



విమానాశ్రయంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం





ప్రయాణికులను రక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం